V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
20-08-2024

సంపుటి : 01 | సంచిక : 108 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్











## రక్షా బంధన వేళ..

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు తమ నివాసానికి వచ్చిన మహిళలు, చిన్నారులతో రాఖీ కట్టించుకున్నారు. ప్రధాని మోదీ సైతం చిన్నారులతో రాఖీ కట్టించుకొని వారితో కాసేపు సరదాగా గడిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రాఖీ కట్టారు. పశ్చిమ్ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్.. ట్రాన్స్ జెండర్లతో రాఖీ కట్టించుకోగా.. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ చెట్టుకు రాఖీ కట్టారు. ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి ఏపీ చంద్రబాబుకు మాజీ మంత్రి జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ, పలువురు బ్రహ్మకుమారీలు, మహిళలు రాఖీలు కట్టారు.





## త్వరలోనే పటిష్టమైన రెవెన్యూ చట్టం



- ఎలాంటి లొసుగుల్లేకుండా తీసుకొస్తాం
- అది దేశానికి నమూనా కాబోతోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

5

## అర్హత ఉన్న ప్రతిరైతుకూ కచ్చితంగా రుణమాఫీ



5

- ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది
- రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాల తప్పుడు ప్రచారం
- రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టాం
- సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## మరింత వేగంగా జాతీయ రహదారుల నిర్మాణం

- సురక్షిత రహదారిగా ఎన్.హెచ్-65
- నాగ్ పూర్ – విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూసేకరణ
- జాతీయ రహదారులపై సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



5

## పురోగతి ఉంటేనే సహకారం



5

- లేదంటే ప్రత్యక్ష చర్యలు తప్పవు
- ఆయిల్ పామ్ కంపెనీ నిర్వాహకులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

## దేశ క్రీడా రంగానికి కేంద్రంగా

# తెలంగాణ

### ఒకే గొడుగు కిందకు రాష్ట్రంలోని క్రీడా శిక్షణ సంస్థలు

అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ

భవిష్యత్తులో ఒలింపిక్స్ వేదికగా హైదరాబాద్

రాష్ట్రం యంగ్ ఇండియాకు బ్రాండ్ గా మారాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:**

దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో క్రీడలు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. రాష్ట్రంలోని క్రీడా శిక్షణ సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేలా, ప్రతీ క్రీడకు ప్రాధాన్యమిచ్చేలా అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్

మిగతా5లో...

## గురుకుల పాఠశాలలకు త్వరగా స్థల సేకరణ

### యుద్ధ ప్రాతిపదికన డిజైన్ల రూపకల్పన చేయాలి

- రూ.5 వేల కోట్లతో 30 ప్రదేశాల్లో 120 గురుకుల పాఠశాలల నిర్మాణం
- హాస్టళ్లలో చదివే ప్రతి విద్యార్థీ మంచం పైనే పడుకోవాలి
- విద్యార్థుల వసతుల కల్పనపై 29 లోగా చెక్ లిస్టు తయారు చేసి ఇవ్వాలి
- ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదే
- పెద్దాపూర్ పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి
- గురుకుల పాఠశాలల ఉన్నత అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- సమీక్షకు హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

5



## తల్లిదండ్రులను కోల్పోయిన బాలికకు సీఎం బాసట



5

- అండగా నిలవాలంటూ కలెక్టర్‌కు ఆదేశం
- మానవత చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి

## 23న ఉక్రెయిన్‌కు ప్రధాని మోదీ

- ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ కానున్న ప్రధాని
- రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలపై చర్చించనున్న ఇరువురు నేతలు...



5

## కాళేశ్వరం ప్రాజెక్టుపై రేపటి నుంచి పీసీ ఘోష్ కమిషన్ బహిరంగ విచారణ

- కాళేశ్వరం ప్రాజెక్టుపై రేపటి నుంచి పీసీ ఘోష్ కమిషన్ బహిరంగ విచారణ
- వేదిక కానున్న బీఆర్కే భవన్



5


మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి


### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 117 | ₹ 129 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 187 | ₹ 230 |

## ఆర్టీసీ బస్సులో ఆడబిడ్డ జననం



- గర్భిణీకి ప్రసవం చేసిన మహిళా కండక్టర్
- నర్సు సాయంతో సకాలంలో పురుడుపోయడం వల్ల తల్లీబిడ్డ క్షేమం
- అభినందించిన మంత్రి పొన్నం, ఎండీ సజ్జనార్

2

# సిటీ పై సీజనల్ వ్యాధుల పంజా



### రోగులతో కిటకిటలాడుతున్న చిన్న క్లినిక్‌లు

- దోమలపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- బస్తీలు, మురికివాడల్లో ప్రబలుతున్న మలేరియా, డెంగ్యూ
- నిద్రావస్థలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ
- తూతూ మంత్రంగా సాగిన జిహెచ్ఎంసి స్పెషల్ డ్రైవ్

**విశ్వంభర హైదరాబాద్ :**గ్రేటర్ హైదరాబాద్ నగరంపై సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాల్సిన జిల్లా ఆరోగ్య వైద్య శాఖ నిద్రావస్థలో ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దోమల నివారణకు జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలు కూడా విఫలమవుతున్నాయి. ఇటీవల స్పెషల్ డ్రైవ్ గా నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కూడా తూతూ మంత్రంగానే ముగిసింది. తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై నీళ్లు నిలువ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి.

మిగతా5లో...

# ఆర్టీసీ బస్సులో ఆడబిడ్డ జననం



**విశ్వంభర, హైదరాబాద్:** టీజీఎస్ ఆర్టీసీ బస్సులో గర్భిణీకి డెలివరీ చేసి మానవత్వం చాటుకున్న వనపర్తి డిపో మహిళా కండక్టర్ జి. భారతికి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందనలు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సులో ప్రయాణిస్తున్న నర్సు సాయంతో సకాలంలో పురుడుపోయడం వల్లే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఒకవైపు సమర్థంగా విధులు నిర్వర్తిస్తూనే సేవాతత్వం చాటుతుండటం అభినందనీయం అని మంత్రి పొన్నం కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

**అసలేం జరిగింది?..**

గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గద్వాల-వనపర్తి రూట్ పల్లెవెలుగు బస్సులో సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణీ రక్షాబంధన్ సందర్భంగా తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తి బయలుదేరింది.బస్సు వనపర్తి జిల్లా నాచహల్లి సమీపంలోకి రాగానే గర్భిణీకి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ జి.భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న ఒక నర్సు సాయంతో గర్భిణీకి పురుడు పోశారు. ఆ మహిళ పండింటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం 108 అంబులెన్స్ సాయంతో తల్లీబిడ్డను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

**కండక్టర్‌ను అభినందించిన సజ్జనార్..**

మరోవైపు ఈ ఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సైతం స్పందించారు. "రాఖీ పండుగ నాడు టీజీ ఆర్టీసీ బస్సులో గర్భిణీకి డెలివరీ చేసి ఒక మహిళా కండక్టర్ మానవత్వం చాటుకున్నారు. తాను విధులు నిర్వర్తిస్తున్న బస్సులో గర్భిణీకి పురిటి నొప్పులు రాగా, ఆమె వెంటనే స్పందించి బస్సులో ప్రయాణిస్తున్న నర్సుతో కలిసి ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు." అని ట్వీట్ చేశారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతూనే సామాజిక బాధ్యతగా సేవాస్ఫూర్తిని ఆర్టీసీ ఉద్యోగులు చాటుతుండటం గొప్ప విషయమని కొనియాడారు. సమయస్ఫూర్తిని ప్రదర్శించి మహిళతోపాటు బిడ్డ ప్రాణాలు కాపాడిన కండక్టర్‌కు అభినందనలు తెలియజేశారు.

# దూకుడు పెంచిన హైడ్రా

- గండిపేట బఫర్ జోన్ లో 50 బడా అక్రమ నిర్మాణాలు నేలమట్టం
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు గుర్తింపు
- బాధ్యులైన వ్యక్తులపై క్రిమినల్ కేసులు50
- యజమానులు బిల్డర్లపై కూడా కేసులు పెట్టే ప్రతిపాదన
- గ్రేటర్ బయట ఆక్రమణలపై హైడ్రా కొరడా





**విశ్వంభర హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ లో ప్రభుత్వ భూములు, ఆస్తులు, చెరువులు, నాలాలను కాపాడే బాధ్యత తో ప్రభుత్వం నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన హైడ్రా మరింతగా దూకుడు పెంచింది. గడిచిన 30 రోజుల్లో హైడ్రా గాజుల రామారం, శివరాంపల్లి చెరువు, పటాన్ చెరువు లలో అక్రమ నిర్మాణాలను తొలగించింది. ఇప్పుడు గ్రేటర్ పరిధి దాటి యాక్షన్ మొదలుపెట్టింది. ఔటర్ రింగ్ రోడ్ నుంచి నాలుగు, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గండిపేట బఫర్ జోన్ లోని ఖానాపూర్ లో మరో 50 బడా ఆక్రమ నిర్మాణాలను తొలగించింది. గండిపేట చెరువులో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేసే పనులు ఆదివారం ప్రారంభం కాగా సోమవారం కూడా కొనసాగాయి. అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేశారు.గండిపేట చెరువుకు సంబంధించి ఎఫ్. టి. ఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో స్థానిక ప్రజలు హైడ్రా విభాగానికి ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా కమిషనర్ ఏ. వి. రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిన అధికారులు గండిపేట ఎఫ్. టి. ఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగినట్లుగా నిర్ధారించిన హైడ్రా అధికారులు 50 బహుళ అంతస్తుల భవనాలను స్థానిక మున్సిపల్, రెవిన్యూ, వాటర్ బోర్డు, పోలీసుల పర్యవేక్షణలో కూల్చివేశారు. ప్రధానంగా 2009 లో స్థానిక గ్రామ పంచాయితీ కి చెందిన మహిళా సర్పంచ్ గతంలో గ్రామ పంచాయితీ పేరుతొ ఇండ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినట్లు హైడ్రా అధికారుల విచారణలో తేలింది. కానీ సదరు సర్పంచ్ ఇప్పటికీ పాత తేదీలతో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారని, ఇది చట్టవిరుద్ధమని హైడ్రా అంటోంది. పాత తేదీల్లో అనుమతులను జారీ చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు హైడ్రా హెచ్చరించింది. అలాగే ప్రస్తుతం రోజుల్లో నిర్మాణం కోసం పాత తేదీలపై జారీ చేసిన అనుమతి పత్రాలు చెల్లవని, ప్రస్తుత మున్సిపల్ నిబంధనలు అనుసరించి భవన నిర్మాణం కోసం స్థానిక మున్సిపల్ అధికారుల నుండి అనుమతి పొందాల్సి ఉంటుందని హైడ్రా స్పష్టం చేసింది. కావున గతంలో సర్పంచ్ జారీ చేసిన అనుమతి పత్రాలు చెల్లవన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని. కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

## గండిపేట చెరువు కలుషితం కాకుండా కాపాడుకుందాం: హైడ్రా కమిషనర్ రంగనాథ్



ప్రధానంగా నగర ప్రజలకు మంచినీటిని అందిస్తున్న గండిపేట చెరువులో అక్రమ నిర్మాణాలకు పాల్పడం ద్వారా వాటిని నుండి వచ్చే వ్యర్థాలు చెరువులోకి చేరి మంచినీరు కలుషితం అవుతున్నట్లు గుర్తించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే నగర ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడే ప్రమాదం కూడా పొంచి ఉందన్నారు. తప్పుడు పత్రాలు, కాలం తీరిన అనుమతులతో ఎల్. టి. ఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు చేయవద్దని, ఆయా ప్రాంతాలలో స్థిరాస్తులు కొనుగోలు చేయవద్దని సూచించారు. వెంచర్లపై ఏమాత్రం అనుమానాలున్న సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులను సంప్రదించి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని హైడ్రా కమిషనర్ సూచించారు.









# నీవు నాకు రాక్ష..నేను నీకు రక్ష

- రాష్ట్రవ్యాప్తంగా వేడుకగా రాఖీ సంబరాలు
- నేతలకు రాఖీ కట్టిన సోదరీమణులు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

నువ్వు నాకు రక్ష - నేను నీకు రక్ష - మనమంతా దేశానికి రక్ష అనే భావన పెంచేదే రాఖీ పండుగ. ఈ వేడుకను యావత్ దేశమంతా ప్రజలు ఉత్సాహంగా చేసుకున్నారు. సోదరులు అండగా ఉంటాలంటూ సోదరీమణులు రాఖీలు కడితే, రక్షగా నిలుస్తానంటూ సోదరులు మాటిచ్చారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. పండుగ వేళ రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, ఎంపీ కావ్య సహా పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు.

**నాయకులకు రాఖీ కట్టిన సోదరీమణులు**

జీవితాంతం తమకు తోడుండాలంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సోదరీమణులు రాఖీ కట్టి హారతులిచ్చారు. మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు. అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంట్లో పలువురు రాఖీకట్టి వేడుకను జరిపారు. రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోదరి రాఖీ కట్టగా ఆడబిడ్డకు అభివందనం చేశారు. రాఖీ పండుగను పురస్కరించుకుని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు పలువురు కార్పొరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు రాఖీ కట్టారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కోదండరాంకు మహిళా సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

**తెలంగాణ భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు**

తెలంగాణ భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు మహిళా ప్రజాప్రతినిధులు కేటీఆర్‌కు రాఖీ కట్టారు. సోదరి కవిత తనకు రాఖీ కట్టలేకపోయినా ఎప్పటికీ అండగా ఉంటానని కేటీఆర్ తెలిపారు. గతంలో సోదరి కవిత రాఖీ కట్టిన ఫోటోలను ఎక్స్ వేదికగా పంచుకుని గుర్తుచేసుకున్నారు. సిద్దిపేట శాసనసభ్యుడు హరీశ్‌రావుకు హైదరాబాద్ కోకాపేట్‌లోని ఆయన నివాసంలో పలువురు మహిళలు రాఖీలు కట్టగా వారి అభిమానానికి హరీశ్ ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్ శాసనసభ్యుడు మల్లారెడ్డి రాఖీ పౌర్ణమి సందర్భంగా బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో సోదర, సోదరీమణులతో రాఖీ పండుగ జరుపుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

మిలిటరీ ఆసుపత్రిలో రక్షాబంధన్ వేడుకలు : సికింద్రాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యరెడ్డి తిరుమలగిరిలోని మిలిటరీ ఆసుపత్రిలో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. దేశ రక్షణ కోసం పాటుపడే సైనికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల నడుమ రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ గోడం నగేష్ నివాసానికి వచ్చిన పలువురు మహిళామణులు రాఖీ కట్టి ఆప్యాయతను చాటుకున్నారు.

**తమ్ముడికి బస్సు ఆపి మరీ సోదరి రాఖీ**

హైదరాబాద్ హిమాయత్‌నగర్ బ్రహ్మ కుమారీస్ పీస్ హౌస్‌లో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద హాజరయ్యారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయా విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టర్‌కి రాఖీ కట్టారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వ ర్యంలో జంజాల పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో మహిళా కండక్టర్లు తోటి ఉద్యోగులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాకలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తన తమ్ముడికి బస్సు ఆపి మరీ తన సోదరి రాఖీ కట్టింది. అక్కాతమ్ముడి మధ్య ఉన్న అన్యోన్యతను చూసి బస్సులో ఉన్న ప్రయాణికులు మంత్రముగ్ధులయ్యారు.

**ప్రతి మహిళను ఇంటిబిడ్డగా చూడాలి : మంత్రి సీతక్క**

ప్రతి మహిళను మన ఇంటి బిడ్డగా చూస్తే అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగవని మంత్రి సీతక్క అన్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనకు, స్పీకర్ ప్రసాద్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ప్రజలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డల మీద ఆంక్షలు పెట్టకుండా స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఇచ్చి వారిని ఎదగనీయాలని కోరారు. అన్నాచెల్లెళ్ల మధ్య అనురాగాలకు ఆప్యాయతలకు ప్రతీకగా రాఖీ పండగ నిలుస్తుందని, అమ్మాయిలను గౌరవించుకోవాల్సిన అవసరాన్ని రాఖీపండగ చాటిచెబుతుందన్నారు. మహిళా భద్రతకు పాటుపడేందుకు ప్రతిఒక్కరూ ప్రతినబూనాలని కోరారు. మహిళలను గౌరవించుకోవటం మన సంస్కృతిలో భాగం అన్నారు. సోదరులు అందరూ బాగుండాలని ప్రతి ఆడబిడ్డా కోరుకుంటుందన్నారు. సమాజంలో వస్తున్న మార్పుల వల్ల మహిళల పట్ల అనేక రకాల హింస జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోదరుడు తన సోదరికి సమాజం లో మంచి భద్రత, గౌరవం దక్కాలనుకుంటారో అలాగే సమాజంలో ప్రతి ఆడబిడ్డనూ గౌరవించాలని కోరారు.

## ప్రేమ ఆప్యాయతలకు ప్రతీక రక్షాబంధన్: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం



ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక రక్షాబంధన్ అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం కు మహిళా సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఈ వేడుకలు వేదికగా నిలిచి మానవీయ విలువలను పెంపొందిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ పండుగ ద్వారా కుటుంబ వ్యవస్థ బలపడే విధంగా , కుటుంబాల మధ్య ఐక్యతను పెంచే విధంగా తద్వారా ప్రజల మధ్య ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కోదండరాంకు రాఖీలు కట్టిన వారిలో తెలంగాణ జన సమితి మహిళా నాయకురాలు గీతాంజలి, పుష్పలత, శాంతాబాయి, శివలక్ష్మి, సూరపు రెడ్డి రాణి, మంజుల, సాజిద్ ఖాన్, దేవేంద్ర, రేఖ, జయంతి, ఉష, శిరీష లు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి ఎల్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు భైరి రమేష్ ,పల్లె వినయ్ గౌడ్ ,తెలంగాణ జన సమితి నాయకులు లక్ష్మారెడ్డి, సత్యనారాయణ,బట్టల రామచందర్ ,ఎస్ జస్వంత్ కుమార్ ,సురేష్ కుమార్ లక్ష్మణ్, జైపాల్ రెడ్డి ,సుధాకర్, రాజు, మధు, ఇస్మాయిల్, మాణిక్యం , కె.వి, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి భుజం ఎక్కి.. హాస్టల్‌లో ఉన్న అక్కతో రాఖీ కట్టించుకున్న తమ్ముడు!



రక్షా బంధన్ రోజున తోడబుట్టిన అన్న లేదా తమ్ముడికి అక్కాచెల్లెమ్మలు రాఖీ కట్టడం సంప్రదాయం. ఎంతో సంతోషంగా అక్కలతో రాఖీ కట్టించుకుందామని వచ్చిన బాలుడికి పాపం.. నిరాశే ఎదురైంది. దాసరి అశ్విక, సహస్ర అనే ఇద్దరు బాలికలు మంచిర్యాల జిల్లా రామక్రిష్ణాపూర్ సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. అక్కలిద్దరూ రాఖీ పండుగ అయినా ఇంటికి రాకపోవడంతో.. స్వీట్లు, రాఖీలు తీసుకుని తండ్రితో కలిసి జితేంద్ర హాస్టల్ దగ్గరికి వెళ్లాడు. అయితే.. హాస్టల్ వార్డన్, వాచ్‌మెన్‌లు.. లోపలికి ఎంట్రీ లేదు అని గేటు దగ్గరే ఆపేశారు. రాఖీనే కదా మేడమ్.. ఐదు నిమిషాల పని అంతే కదా అని మొత్తుకున్నా సరే అస్సలు లోపలికి అనుమతించలేదు. అప్పటికే.. బయట జితేంద్ర, లోపల అక్కలిద్దరూ ఒక్కటే ఏడుపు. ఏం చేయాలో ఆ తండ్రికి తోచలేదు. ఎలాగైనా సరే రాఖీ కట్టించుకునే ఇంటికి వెళ్లాలని కుమారుడు పట్టుబట్టాడు. ఇంతలోనే తండ్రికి ఓ ఐడియా వచ్చింది. హాస్టల్ వెనుక వైపు వెళ్లిన ఆ తండ్రి.. కుమార్తెలను పేర్లు పెట్టి పిలిచారు. ఇంతలోనే వారిద్దరూ కిటికీ దగ్గరికి రాగా.. జితేంద్రను భుజాలపై ఎక్కించుకున్న తండ్రి.. అక్కలతో రాఖీలతో కట్టించుకున్నాడు. అనంతరం కిటికీలో నుంచే ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఆ తర్వాత ఇటు తమ్ముడు, అటు అక్కలు ఎంతో సంతోషంగా వెనుదిరిగారు. సోషల్ మీడియా వేదికగా ఈ వీడియో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది.



# వేగంగా విస్తరిస్తోన్న మంకీఫాక్స్

## ఎయిర్ పోర్టులకు కేంద్రం అలర్ట్



**విశ్వంభర, ఢిల్లీ:** ప్రాణాంతక మంకీపాక్స్ వైరస్ ప్రపంచ దేశాల్లో వేగంగా విస్తరిస్తోంది. పాకిస్థాన్లోనూ నాలుగు అనుమానిత కేసులు నమోదయ్యాయి. సౌదీ నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్కు వచ్చిన ఓ వ్యక్తిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయి. స్వీడన్లో ఇప్పటికే వైరస్ వెలుగు చూడగా.. తాజాగా ఫిలిప్పీన్స్లోనూ వైరస్ నిర్ధరణ అయ్యింది. ఈ నేపథ్యంలో భారత్ సైతం అప్రమత్తమైంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని విమానాశ్రయాలు, ల్యాండ్ పోర్టుల్లోని అధికారులు.. ఎంపాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొన్నట్లు సమాచారం.ఎంపాక్స్ వ్యాధిని ఎదుర్కొనేందుకు గాను దేశ రాజధానిలో మూడు కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులను నోడల్ కేంద్రాలుగా కేంద్ర ఆరోగ్యశాఖ గుర్తించింది. రామ్మనోహర్ లోహియా ఆసుపత్రి, సఫారింగ్తోపాటు లేడీ హార్డింగ్ ఆసుపత్రుల్లో ఐసోలేషన్ కేంద్రాలు, నిర్వహణ, చికిత్సకు ఏర్పాట్లు చేయనుంది. ఆయా రాష్ట్రాల్లో నోడల్ సెంటర్లను గుర్తించి వైరస్ను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఇదే అంశంపై ఆగస్టు 18న ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం.. 2022 నుంచి ఇప్పటివరకు 116దేశాలకు ఎంపాక్స్ వైరస్ విస్తరించింది. మొత్తం 99,176 కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాంగోలో వేగంగా వ్యాపిస్తోంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 15,600కేసులు నమోదు కాగా 537 మరణాలు సంభవించాయి. భారత్లో 2022 నుంచి ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు రికార్డయ్యాయి. మార్చి 2024లో చివరి కేసు గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆ తర్వాత దేశంలో ఎటువంటి ఎంపాక్స్ కేసులు కొత్తగా నమోదు కాలేదని తెలిపింది.

# డిపాజిట్ల సేకరణపై ఫోకస్ పెంచాలి

## - బ్యాంకర్లతో ఆర్థిక మంత్రి




**ఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకులు డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరు, సామర్థ్యంపై కేంద్ర మంత్రి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిపాజిట్ల సేకరణ, డిజిటల్ చెల్లింపులు, సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్వర్క్ వంటి పలు అంశాలపై బ్యాంకుల పురోగతిని పర్యవేక్షించారు. 202324లో బ్యాంకులు అన్ని విభాగాల్లో మెరుగైన సామర్థ్యం కనబరచడంతో నికర నిరర్థక ఆస్తులు 0.76 శాతానికి తగ్గాయని సమావేశంలో వెల్లడైంది. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగైందని తేలింది. బ్యాంకుల సామర్థ్యం మెరుగవడంతో మార్కెట్ల నుంచి బ్యాంకులు మూలధనాన్ని సమీకరించే సామర్థ్యం కూడా పెరిగిందని గుర్తించారు. ఈ కాలంలో బ్యాంకులు ఏకంగా రూ. 27,830 కోట్ల డివిడెండ్ను వాటాదారులకు పంచాయి.
పరపతి వృద్ధికి అనుగుణంగా ఆ డిమాండ్ను అందుకునేందుకు డిపాజిట్ల సేకరణను పెంచాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ రంగ బ్యాంకులను కోరారు. ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించడం ద్వారా డిపాజిట్స్ను రాబట్టాలని ఆమె బ్యాంకులకు సూచించారు. కస్టమర్లను బ్యాంకు ఉద్యోగులు నేరుగా కలిసి వారితో అనుబంధం పెంచుకోవడంతో పాటు డిపాజిట్లను పెంచేందుకు వినూత్న ఉత్పత్తులతో బ్యాంకులు ముందుకెళ్లాలని కోరారు.




# చెరువులను తలపించిన రహదారులు

## హైదరాబాద్ సహా రాష్ట్రంలో పలుచోట్ల భారీవర్షం



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానతో నగరవాసులు తడిసి ముద్దయ్యారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వాన నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. అటు కుత్బుల్లాపూర్, గాజుల రామారం, జగద్గిరిగుట్ట, బహదూర్పల్లి, సూరారం, సుచిత్ర, గుండ్లపోచంపల్లి, పేట్ బషీరాబాద్, జీడిమెట్ల, బోయిన్పల్లి, ప్రగతి నగర్, బేగంపేట, తిరుమలగిరి, అల్వాల్, మారేడుపల్లి, కూకట్పల్లి, హైదర్నగర్, బాచుపల్లి, మూసాపేట్లోనూ వర్షం పడింది. రహదారులపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్జామ్ అయ్యింది.

**నిజామాబాద్లో వర్షా లు..**

మరోవైపు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నిజామాబాద్, ఆర్మూర్, బీర్కూర్ ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. నిజామాబాద్ జిల్లాలోని నవీపేట, ఇందల్వాయి, డిచ్పల్లి, సిరికొండ మండలాల్లో జోరు వాన కురిసింది. ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో నిజామాబాద్ నగరంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి.

**ఉక్కపోత నుంచి ఉపశమనం..**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా వర్షాలు లేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఇవాళ కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఏకధాటిగా వర్షం కురువడం వల్ల ప్రధాన రహదారులపై నీరు చేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల డ్రైనేజీలు పొంగిపోవడంతో రహదారులపై వరద నీరు ప్రవహించింది.

**సంగారెడ్డిలో భారీ వర్షం..**

సంగారెడ్డి నియోజకవర్గంలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. సదాశివపేట పట్టణంలో వర్షానికి డ్రైనేజీ నీరు నిండి రోడ్డుపైకి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, వర్షాలు కురిసినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

## జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి




జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి తదితరులు

**విశ్వంభర హైదరాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని జీహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తో కలిసి కమిషనర్ ఆమ్రపాలి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు.
డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతుల పరిష్కారం పై ఆయా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 25 విన్నపాలు రాగా, ఫోన్ ద్వారా 4 విన్నపాలు వచ్చాయి. వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 30 విన్నపాలు వచ్చాయి.
అందులో కూకట్ పల్లి జోన్ లో 12, సికింద్రాబాద్ జోన్ లో 10, ఎల్బీనగర్ జోన్ లో 4, చార్మినార్ జోన్ లో 2, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్ లలో ఒక్కటి చొప్పున విజ్ఞప్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సత్యనారాయణ, యాదగిరి రావు నళిని పద్మావతి సిసిపి శ్రీనివాస్, వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి,, యస్ ఈ హౌసింగ్ జాయింట్ కమిషనర్ ఎస్.బి.ఎం కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.




# గాలి మాటలు చెప్పడం మానుకోవాలి

- కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన సీతక్క



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే తాను పట్టించుకోవడం లేదన్న కేటీఆర్ వ్యాఖ్యలపై, మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. రాఖీ పండుగ రోజు కూడా మహిళా మంత్రిని, మహిళా కమిషన్ ఛైర్పర్సన్ను నిందించడం కేటీఆర్కే చెల్లిందని ఆమె విమర్శించారు. పండుగ పూట రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ అవాస్తవాలు చెబుతున్నారన్న సీతక్క, మహిళా భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు.
రాష్ట్రంలో నేరాలకు కారణమవుతోన్న డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల కట్టడి కోసం తాము చేపడుతున్న చర్యలు కేటీఆర్కు కనిపించడం లేదా? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 8 నెలల తర్వాత మహిళలపై అఘాయిత్యాలు గుర్తుకు రావాలని కేటీఆర్ చెప్పడం ఆయన అజ్ఞానానికి అద్దం పడుతోందని మంత్రి ఎద్దేవా చేశారు. మహిళలపై ఎక్కడ ఏ అఘాయిత్యం జరిగినా, ప్రభుత్వం సత్వరమే వాయు వేగంతో స్పందించిందని, గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.
ఆమెను అడిగి తెలుసుకో : లైంగిక దాడుల కేసుల్లో ఇప్పటికే 24 మంది దోషులకు శిక్షలు పడేలా చేశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. దోషులకు 20 ఏళ్ల నుంచి యావజ్జీవ కారగార శిక్షలు పడేలా వ్యవహరించామని ఆమె తెలిపారు. బాధితులకు భరోసా కల్పించేందుకు మహిళా పోలీస్ సిబ్బందితో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ఆమె ప్రశ్నించారు. మహిళా భద్రతకు కాంగ్రెస్ ఏం చేసిందో, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన సబితా ఇంద్రారెడ్డిని కేటీఆర్ అడిగి తెలుసుకోవాలని సూచించారు.
వరంగల్లో అమ్మాయిలపై యాసిడ్ దాడి జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరిగిందో అందరికీ తెలుసునని, అప్పట్లో "దటీజ్ వైఎస్సార్" అని అంతా అభినందించినట్లు సీతక్క గుర్తు చేశారు. చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒకేసారి 138 మంది మహిళా ఎస్ఐలు, 2400 మంది మహిళా పోలీస్ కానిస్టేబుళ్లను రిక్రూట్ చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆస్తులు, అంతస్థులతో నిమిత్తం లేకుండా ఇప్పటికైనా మహిళలను గౌరవించడం కేటీఆర్ నేర్చుకోవాలని మంత్రి సీతక్క హితవు పలికారు.
రాష్ట్రంలో శాంతిభద్రతలు బీఆర్ఎస్ హయాంలో ఎలా ఉన్నాయో? ఇపుడు ఎలా ఉన్నాయో? అందరికీ తెలుసని, కావాలంటే ఓ కమిషన్ వేసి విచారణ చేసుకోవచ్చని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎనిమిది నెలల తర్వాత అయినా మంత్రి సీతక్కకు మహిళలపై అఘాయిత్యాలు గుర్తుకురావడం మంచిదని, ఈ ప్రభుత్వం తీరు దున్నపోతు మీద వాన పడ్డట్లుగా ఉందని ఆయన విమర్శించారు. మహిళలపై జరిగిన వివిధ ఘటనల్లో తమ పార్టీ నాయకులు వెళ్లే వరకు పట్టించుకున్న పాపాన పోలేదని, రాష్ట్రానికి హోంమంత్రి కూడా దిక్కులేరని కేటీఆర్ దుయ్యబట్టారు.
తాను పొరపాటున నోరుజారి ఒక మాట అంటే క్షమాపణ చెప్పానని, ఆ తర్వాత కూడా ప్రపంచంలో ఇంతకంటే పెద్ద సమస్య లేనట్లు రాజకీయ రంగు పులుముతున్నారని కేటీఆర్ ఆక్షేపించారు. షీటీమ్స్, భరోసా కేంద్రాలు, ఉమెన్స్ సేఫ్టీ వింగ్ తదితరాలను ఎవరి హయాంలో ప్రారంభించారని ఆయన ప్రశ్నించారు. కోల్కతాలో మహిళపై ఆఘాయిత్యం జరిగితే తెలంగాణలో చేసిన న్యాయం చేయాలని అంటున్నారని, "దటీజ్ కేసీఆర్" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాజీవ్ గాంధీ

**నేడు ఆయన జయంతి**

భారతదేశ ఆధునిక చరిత్రలో రాజీవ్ గాంధీ ఒక ముఖ్యమైన వ్యక్తి. ఆధునిక భారతాన్ని రూపొందించడంలో ఆయన పోషించిన పాత్ర విశేషమైనది. కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాలలో అతను అనేక ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజీవ్ గాంధీని భారతదేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవం యొక్క ఘనత అతనికే చెందుతుంది. ఆలస్యంగా, అయిష్టంగా రాజకీయాల్లో ప్రవేశించిన రాజీవ్ ప్రధానిగా భావి భారత దేశం ఎలా ఉండాలి అనే యోచించారు. వ్యక్తి తన కులం, పుట్టుక, మతం, రంగు మొదలైన వాటితో సంబంధం లేకుండా అభివృద్ధిని అనుభవించాలని ఆయన కోరుకున్నారు. రాజ్యాంగంలోని 73వ ఆర్టికల్ ద్వారా స్థానిక సంస్థలకు నేరుగా కేంద్ర నిధులు వచ్చే విధంగా కృషి చేశారు. ఎన్నో ప్రజాహిత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అతను విదేశీ విధానంలో చురుకైన పాత్ర పోషించాడు, శ్రీలంక, సోవియట్ యూనియన్ తో సంబంధాలను మెరుగుపరచడానికి కృషి చేశాడు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారు. రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారు.

రాజీవ్ గాంధీ వ్యక్తిగత జీవితం:

ఫిరోజ్ గాంధీ, ఇందిరా గాంధీ దంపతులకు ఇద్దరు సంతానం మొదటి కుమారుడు రాజీవ్ గాంధీ, రెండవ కుమారుడు సంజయ్ గాంధీ. రాజీవ్ గాంధీ 1944 సం. ఆగష్టు 20 తేదిన మహారాష్ట్ర (ముంబాయి) నందు జన్మించారు. డెహ్రా డన్‌లోని వెల్హామ్స్ స్కూల్, డూన్ స్కూల్ మరియు న్యూ ఢిల్లీలోని సెయింట్ కొలంబస్ స్కూల్‌లో పాఠశాల విద్య నభ్యసించి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదివినాడు. రాజీవ్ అందరి యువకుల మాదిరి గా తన జీవితం కూడ నల్లేరు మీద నడక లాగ ఉంటుందని భావించాడు. తన భవిష్యత్తు ఉన్నతమైన రీతిలో ఉండాలనే ఉద్దేశ్యంతో ఢిల్లీలోని ఫ్లయింగ్ క్లబ్‌లో చేరి వాణిజ్య పైలట్ లైసెన్స్ పొంది 19170లో ఎయిర్ ఇండియా సంస్థ ద్వారా అందులో పైలట్‌గా నియమించబడ్డాడు. విదేశీ చదువుల కోసం లండన్ దేశానికి వెళ్లిన. రాజీవ్ 1966లో భారత్ కి తిరిగి వచ్చాడు. 1968 సం. ఫిబ్రవరి 25న రాజీవ్ గాంధీ ఎడ్విజ్ ఆంటోనియా అల్బినా మైనో (సోనియా గాంధీ)ను వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు 1970లో రాహుల్ గాంధీ,1972లో ప్రియాంక గాంధీ జన్మించింది.

రాజీవ్ గాంధీ జీవితంలో యాదృచ్ఛిక రాజకీయ పరిణామం..

1980 సం. జూన్ 23న జరిగిన విమాన ప్రమాదంలో తన తమ్ముడు సంజయ్ గాంధీ మరణించాడు. అప్పటికి వరకు రాజకీయాలకు దూరం జీవించిన రాజీవ్ గాంధీ. నాటి అత్యవసర రాజకీయ పరిస్థితుల్లో తన తల్లికి సహాయంగా ఉండేందుకు అయిష్టంగా 1981 ఫిబ్రవరి 16న రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించి ఢిల్లీలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హత్య తరువాత, రాజీవ్ గాంధీ 40 సంవత్సరాల వయస్సులో భారతదేశానికి ప్రధానమంత్రి అయ్యాడు. ప్రపంచంలో అత్యంత పిన్న వయస్కుడైన ప్రధాన మంత్రి గా రాజీవ్ గాంధీ చరిత్ర సృష్టించారు. దేశంలో అధికారం నిలబెట్టటానికి అనుభవం లేనివాడు అని కొందరు భావించినప్పటికీ, 1984 సం. అక్టోబర్ 31న తన తల్లి ఇందిరా గాంధీ హత్య జరిగిన తర్వాత రాజీవ్ దృఢమైన మరియు స్థిరమైన ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా దేశంలోనే అతను తిరుగులేని నాయకుడుగా నిలబెట్టింది. అతనికి ఎంతో మంది అభిమానులను సంపాదించిపెట్టింది.

రాజీవ్ గాంధీ లోక్ సభ సభ్యుడుగా ఎన్నిక, నిర్వర్తించిన బాధ్యతలు..

ఉత్తర ప్రదేశ్ లోని అమేథీ లోక్ సభ నియోకవర్గానికి 1980 నుండి 1991 వరకు రాజీవ్ గాంధీ లోక్ సభ్యునిగా ప్రాతినిధ్య వహించాడు. దేశ ప్రధాన మంత్రి పదవితో పాటు కేంద్ర మంత్రి గా ఆర్థిక, సమాచార, రవాణా, జల వనరుల, పథకాల అమలు శాఖ, వాణిజ్యం మరియు సరఫరా, విదేశీ వ్యవహారాలు, పరిశ్రమలు మరియు కంపెనీ వ్యవహారాలు, శాస్త్ర, సాంకేతిక, అణు విద్యుత్తు, అంతరిక్షం, ఎలక్ట్రానిక్స్, సముద్రాభివృద్ధి, సిబ్బంది మరియు పరిపాలనా సంస్కరణలు, క్రీడలు, యువజన వ్యవహారాలు, సంస్కృతి, పర్యాటకం మరియు పౌర విమానయానం, పర్యావరణం మరియు అడవుల పరి రక్షణతో పాటు మొదలైన మంత్రిత్వ శాఖల బాధ్యతలను చేపట్టారు. 1989లో లోక్ సభ ప్రతి పక్ష నాయకుడు గా వ్యవరించాడు.



ప్రధాన మంత్రిగా రాజీవ్ ఉత్తమ సంస్కరణల ఆవిష్కరణ..

1991లో భారతదేశం యొక్క కంప్యూటర్ విప్లవాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం పూర్తిగా కంప్యూటర్ విడి పరికరాలను మన దేశంలో దిగుమతి చేసుకోవడానికి అనుమతించడం తో పాటు కంప్యూటర్ ధరలను తగ్గించింది. ఇతర దేశాలకు కంప్యూటర్‌లను ఎగుమతి చేసే సుంకాన్ని కూడా తొలగించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఎగుమతి లాభాలపై పన్ను మినహాయింపులు ఇచ్చారు . MNCలను 100% ఈక్విటీతో దేశంలోకి ప్రవేశించడానికి అనుమతించారు.1985లో ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఆమోదించారు.1986లో ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం.1986లో భారతదేశంలో విద్యా కార్యక్రమాలను ఆధునీకరించడానికి మరియు విస్తరించేందుకు జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించారు. అదే సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని స్థాపించాడు. ఈ వ్యవస్థ ద్వారా గ్రామీణ భారతదేశంలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించింది. PCOల సహాయంతో టెలిఫోన్ నెట్‌వర్క్ భారతదేశాన్నికి అనుసంధానించే MTNL స్థాపించబడింది.1987లో రాజీవ్ గాంధీ ఇండో-శ్రీలంక ఒప్పందంపై సంతకం చేశారు.ఈ ఒప్పందం ద్వారా తమిళ-మెజారిటీ ప్రాంతాలకు అధికార పంపిణీని జరగాలని.1988లో అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌లో జరిగిన ఉగ్రవాద దాడులను అరికట్టేందుకు 'ఆపరేషన్ బ్లాక్ థండర్' ఏర్పాటుచేశారు. దీని ద్వారా 10 రోజుల్లో పంజాబ్ రాష్ట్రంలో శాంతిని తీసుకొచ్చింది.

1991 మేలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నెలరోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనేకచోట్ల 250 సభల్లో మాట్లాడారు. ఆయన మే 20 మధ్యాహ్న సమయములో బయలుదేరి భువనేశ్వర్ మీదుగా, ఆంధ్ర ప్రదేశ్ లోని కొన్ని నియోజక వర్గాలలో పర్యటించారు. సాయంత్రం 6.30కి వైజాగ్ నుంచి బయలుదేరి చెన్నై చేరుకొని, సాయంత్రం 8.30ని, లకు స్థానిక కాంగ్రెస్ నాయకురాలు మరకతం చంద్రశేఖర్ తో కలసి గ్రాండ్ వెస్ట్రన్ ట్రంక్ రోడ్డు ఆలయ ప్రాంగణములో ఉన్న సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కొద్దిసేపట్లోనే రాజీవ్ గాంధీ మానవ బాంబు పేలుళ్లతో హతమార్చ బడ్డారు. ఎల్‌టీటీఈకి చెందిన ఆత్మాహుతి దళం బాధ్యులు నళిని, శ్రీలంక జాతీయుడైన ఆమె భర్త మురుగన్ ఎల్‌టీటీఈ ఉగ్రవాదులతో కలిసి రాజీవ్ గాంధీ హత్యకు కుట్ర పన్నారు. మే 21న రాత్రి పది గంటల ప్రాంతంలో ఈ హత్య జరిగింది. ఈ దుర్ఘటనలో సుమారు 14 మంది హతులైనారు.

చిన్న పల్లెటూరులో జనంతో పాటు ఎక్కి ఎక్కి ఏడ్చిస్తున్న చిన్న పోరడు అందరు చూస్తున్న ఇంటి లోపలికి వెళ్ళి ఇక్కడ ఏముందని చూశాడు. అక్కడ మోగుతున్న దూర దర్శన్ టెలివిజన్ టీవీ కనిపించింది. అందులో మానవ బాంబు దాడిలో తున తునకలు అయ్యిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని వార్తలలో చదువుతున్నారు. అది విని జనం గుంపు నుండి బయటకు వచ్చిన పోరడు, వాళ్ళ తల్లిదండ్రులకు అడిగిండు. ఎవరో మరణిస్తే మన ఊరి జనం ఎందుకు ఏడుస్తురని. తల్లిదండ్రులు, బిడ్డ మరణించింది మన దేశానికి ప్రధాన మంత్రి గా పేదలకు, యువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు మేలు చేసిన గొప్ప మానవతావాది. అతను బాంబు పేలుడులో చనిపోయిండు అందుకే అందరం ఏడ్చు స్తుద్రు.మన దేశంలో మంచి వాళ్ళు ఎవరు మరణిస్తే, మన కుంటుంబ సభ్యులుగా భావించే ఉన్న గుణం జాతి మన భారత జాతి బిడ్డ అని చెప్పినారు.

తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో 21 మే 1991న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒక సభలో ఉన్నప్పుడు ఆత్మాహుతి బాంబు దాడి ద్వారా భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య జరిగిన సందర్భంగా దేశవ్యాప్తంగా టెలివిజన్ టీవీ లో ప్రసారం చూసినప్పుడు ప్రజల్లో కలిగి బాధ ఇది.భారత దేశ ఐక్యతను 21వ శతాబ్దంలో కి తీసుకెళ్ళాలని, అందుకు అనుగుణంగా రాజకీయాలను ప్రభావితం చేసిన చేశారు. రాజీవ్ గాంధీ 1984 నుండి 1989 వరకు దేశానికి సేవలందించారు. అందుకు గాను మరణానంతరం రాజీవ్ గాంధీకి భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని అందించింది.



- కొండేటి ప్రకాష్.
7981781086

# దోమలకూ ఓ రోజు ఉంది

**నేడు ప్రపంచ దోమల దినోత్సవం**



దోమ.. పేరులాగే చిన్నగా ఉంటుంది. కానీ, అది వేసే కాటుతో ఏటా లక్షలాది మరణాలు సంభవిస్తున్నాయి. ఆడ దోమ కుట్టి మలేరియా వ్యాధికి కారకురాలై.. ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తోంది. వానాకాలం వస్తే చాలు.. విజృంభిస్తూ మనుషుల ప్రాణాలు తోడేస్తోంది. ఎన్ని రకాల కాయిల్స్, మందులు వాడినా, చివరికి దోమ తెరలు కట్టుకున్నా ప్రయోజనం ఉండటం లేదంటేనే అర్థం చేసుకోవచ్చు.. పరిస్థితి ఎలా ఉందో. అయితే, ఇక్కడో విషయం చెప్పుకోవాలి. వీటి కట్టడికి ఏటా ఓ రోజున ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్న విషయం మీకు తెలుసా.. ఆ రోజే 'ఆగస్టు 20'. దోమల నివారణకు ప్రభుత్వ చర్యలేకాక, ప్రతి ఒక్కరూ తమ చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. వీటి కట్టడి కోసమే ఈ రోజును ఏటా నిర్వహిస్తున్నారు. అసలు ఆగస్టు 20నే ఎందుకంటే.. మలేరియా ఆడ అనాఫలిస్ దోమ కుట్టడంతో వ్యాపిస్తుంది. మల, అరియా అనే రెండు ఇటాలియన్ పదాల కలయికతో మలేరియా అనే పదం పుట్టింది. దీనికి చెడ్డగాలి అనే అర్థం వస్తుంది. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రాన్ని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త ఈ రోజునే కనుగొన్నారు. దీంతో ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రోనాల్డ్‌రాస్.. బ్రిటీష్ ఇండియా శాస్త్రవేత్త సికింద్రాబాద్ లో నివాసముండే రోజుల్లో సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20వ తేదీన మలేరియా పరాన్నజీవి ప్లాస్మోడియం పరాన్నజీవి ఉనికిని, అనాఫిలస్ అనే ఆడదోమ లాలజల గ్రంధుల్లో గుర్తించాడు. ప్లాస్మోడియం జీవిత చక్రాన్ని సైతం విపులంగా వివరించాడు. దీంతో ఆ గొప్ప శాస్త్రవేత్త ఆవిష్కరణకు గుర్తుగా దోమలకు ఒక గుర్తింపు వచ్చింది. ఈయన ఆవిష్కరణకు ముందు ప్రజల్లో వేరే భావన ఉండేది. అంతకు ముందు దీనిని మాల్ అని పిలిచేవారు. మాల్ అంటే చెడు అని అర్థం. చెడు ఏరియా వలన కలిగే వ్యాధి అని అందుకనే అలా పిలిచేవారు. రోనాల్డ్ రాస్ మహానుభావుడి చేసిన కృషి వల్లనే మలేరియాతో పాటు దోమల వల్లే వచ్చే ఇతర వ్యాధులకు నివారణ మార్గాలు సులభ మయ్యాయి. ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, విరేచనాలు, నీరసంగా ఉండటం, చలిజ్వరం, తలనొప్పి, ఆయాసం వంటి తొలిదశలో వచ్చే లక్షణాలు. దోమ కాటుకు గురైన ఏడు నుండి 18 రోజుల మధ్యలో మనకు మలేరియా లక్షణాలు కనిపిస్తాయి. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే మనం మెరుగైన చికిత్సను అందించవచ్చు. దోమ సాధారణంగా ఎక్కడపడితే అక్కడ కనిపించే కీటకం. అది మనుషుల రక్తం తాగి బతుకుతుంది. అయితే అలా అది రక్తం పీల్చేప్పుడు మన శరీరంలోకి కొన్ని క్రిములను కూడా విడుదల చేస్తుంది. ఆ క్రిముల వల్ల ఎన్నో వ్యాధులు వస్తాయి. మలేరియా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా (బోదవ్యాధి), డెంగ్యూ జ్వరం, చికున్ గున్యా, కాలా జ్వరము - నల్ల మచ్చలు జ్వరంలో కనపడే లక్షణాలు, లింఫాటిక్ ఫైలేరియల్ తదితర వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయి. జాతీయ మలేరియా కార్యక్రమం ద్వారా అన్ని జిల్లాలలో జిల్లా మలేరియా కార్యాలయాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉప కేంద్రాలలో సిబ్బంది నియమింప బడి ఉన్నారు. ఇందులో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోజుకు 24 గంటలు పని చేయునట్లుగా ఏర్పాటు చేయబడింది. ఎవరైనా ఎలాంటి జ్వరంతోనైనా బాధపడుతుంటే ఎలాంటి మందులు తీసుకోక ముందు పైన ఉదహరించిన కేంద్రాలకు వెళ్ళి వ్యాధి నిర్ధారణ కొరకు రక్త పరీక్ష చేయించు కోవాలి. వ్యాధి నిర్ధారణలో వచ్చిన జ్వరం మలేరియా మూలంగా అని తేలితే, మలేరియా సిబ్బంది చికిత్స ప్రారంభిస్తారు. మలేరియా క్రిములున్న దోమ ఆరోగ్యవంతున్ని కుట్టినాక 10 నుండి 14 రోజుల వ్యవధిలో వ్యాధి లక్షణాలు బయటకు వస్తాయి. జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్ష చేయించాలి. మలేరియా అని నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవాలి. రక్త పరీక్ష చేసే సదుపాయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లభిస్తుంది. దోమల ద్వారా ఈ జ్వరం వ్యాపిస్తుంది. కావున దోమలు పుట్టి పెరిగే స్థావరాలను అరికట్టాలి. నీరు నిలకడ ప్రదేశాలను పూడ్చి వేయాలి.ఇంటి పరిసరాలలో గుంతలు గోతులు లేకుండా జాగ్రత్త పడాలి.ఇంటి బయట పడుకునే వారికి దోమ తెర, వంటి నిండా బట్ట ఉంచుకోమని తెలియ చేయడం ముఖ్యం. వేపనూనె ఒంటికి రాసుకుంటే దోమ కుట్టదు. చిన్న చిన్న చెరువులు, గుంటలలో గంబూసియా లేక గప్పి చేపలు వదలడం చేపట్టాలి. ఇంటిపై కప్పులో వున్న ట్యాంకులు (ఓవర్ హెడ్ ట్యాంకులు), నీటి కూలర్స్ మొదలగు నీటి తొట్లలో దోమలు పెరగకుండా చూసుకోవాలి. జూన్ – మలేరియా మాసం. ఈ నెలలో స్ప్రే జరిగిందా లేదా చూసుకోవాలి. గ్రామ పంచాయితీలో యాంటీ లార్వలం (దోమ పిల్లలను చంపుట) జరిగిందా లేదా చూసుకోవాలి. చలిజ్వరం కేసులున్నప్పుడు మలేరియా సిబ్బంది వచ్చి రక్తపరీక్ష చేయించడంలో సమన్వయం ఏర్పరచు కోవాలి. ఆగస్టు 20వ తేదీ. బ్రిటీష్ శాస్త్రవేత్త, వైద్యులు, కీర్తిశేషులు రోనాల్డ్ రాస్ ఆవిష్కరణకు గుర్తుగా ప్రపంచ దోమల దినోత్సవాన్ని ప్రతి ఏటా జరుపు కుంటున్నారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# రాజయ్య చిత్రాలు... సజీవ రూపాలు



కాపు రాజయ్య. ఈ పేరు తెలియని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. కాపు రాజయ్య ( ఏప్రిల్ 7, 1925 – ఆగష్టు 20, 2012) తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు. గ్రామీణ నేపథ్యం గల చిత్రాలకు ఆయన పెట్టింది పేరు. ఈయన చిత్రపటాలు ప్రపంచం లోని పలు దేశాలలో ప్రదర్శింప బడడం తెలుగు వారికి గర్వకారణం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఊరూరా వీధి వీధిన, వాడవాడలా ప్రదర్శితాలై, ఉద్యమ కారుల తో మమేకమైన తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక రూపాలు అయిన బోనాలు, బతుకమ్మలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగి పాలనా పగ్గాలు తెరాస చేపట్టాక, అధికారిక పండుగలుగా ప్రకటింప బడటం అందరికి తెలిసిందే. అయితే రాజయ్య ఆయా సాంస్కృతిక వారసత్వ ప్రతీకలను కళా రూపాలుగా దశాబ్దాల క్రితమే కాన్వాసుపై చిత్రీకరించి గ్రామీణ సంస్కృతి ప్రాధాన్యత చాటి చెప్పారు.

దైవదత్తమైన ఆయన కుంచెతో ఏ గీత గీసినా, ఆ కుంచె వాటికి ప్రాణం పోసేది. అందుకే ఆయన చిత్రాలు జీవం పోసుకుని కళ్లముందు సజీవంగా కదలాడుతున్నట్లు కనిపిస్తాయి. గ్రామీణ జీవితాలను నిశితంగా పరిశీలించి, సృజనాత్మకత ఉట్టి పడేలా ఆయన వేసిన చిత్రాలు సహజత్వానికి ప్రతిబింబాలు. నిజానికి ఆ చిత్రాలు సామాన్యమైన జనజీవనం తో ముడివడి ఉన్నవే.

చీరలపై కనిపించే కోలాటం వంటి బొమ్మలు, కూడా వసంత కేళి, రాధాకృష్ణుల చిత్రం, 'పొలం పనులు' సోది చెప్పే మహిళ, పాలమ్మో పాలు అంటూ వీధుల్లోకి వెళ్ళే గొల్లభామల చిత్రాలు, వడ్డెర మహిళ, ఎల్లమ్మ జోగి ఒక్కొక్కటి రాజయ్య మునివేళ్లతో అలవోకగా చిత్రీకరించిన ఒక కళా ఖండమే. తెలంగాణ పల్లె సీమలకు సంబంధించి జానపదుల జీవితాలతో పెనవేసుకున్న సహజ దృశ్యాలను చిత్రించిన కళాకారులు మరొకరు లేరనేది నూటికి నూరుపాళ్లు నిజం.





కాపు రాజయ్య మెదక్ జిల్లా సిద్దిపేటలో 1925 ఏప్రిల్ 7వ తేదీన జన్మించారు. హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన చిత్రకళలో డిప్లమా పొందారు. డ్రాయింగ్‌లో మద్రాసు ప్రభుత్వ డిప్లమా కూడా పొందారు.1963 లో తాను స్థాపించిన లలితకళా సమితి / అకాడమీ ద్వారా ఆయన చెకోస్లోవికియా, హంగేరి, రుమేనియా, బల్గేరియా దేశాల్లో ప్రదర్శనలు పెట్టారు.

నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన కళారంగంలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. చిన్న వయస్సు లోనే తండ్రి మరణించడంతో ఆయన తీవ్రమైన ఇబ్బందుల పాలయ్యారు. కాపు రాజయ్య కుటుంబాన్ని తండ్రి మిత్రుడు మార్క చంద్రయ్య ఆదుకున్నారు. చిత్రకళలో కాపు రాజయ్యకు కుబేరుడు అనే ఉపాధ్యాయుని ప్రోత్సహించారు. ఉన్నత పాఠశాల లో చదువు తున్నపుడు ఆయన మొదటి చిత్ర ప్రదర్శన జరిగింది. ఆ తర్వాత దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా ఆయన తన కుంచెతో చిత్రాలకు ప్రాణప్రతిష్ట చేశారు. తెలుగు చిత్ర కళకు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్ట గలిగారు.

రాజయ్య తొలి చిత్రాలు సంప్రదాయబద్ధమైన, కాలపరీక్షకు నిలిచిన ప్రాచ్య విధానంలో, అంటే వాష్ పద్ధతిలో చిత్రాలు వేశారు. ఆ తర్వాత నకాషీ చిత్రకారుల అద్భుతమైన టెక్నిక్ ఆయను ముగ్ధుడ్ని చేసింది. దాంతో టెంపరా రంగుల వాడకాన్ని ప్రారంభించారు. నకాషీ చిత్రకారులంటే ఆయనకు ఎనలేని అభిమానం. ఇరవై ఏళ్ల పాటు 1950 నుంచి 1970 వరకు ఆయన టెంపరా చిత్రాలు వేశారు. రాజయ్యను 50కి పైగా అవార్డులు వరించాయి. రాష్ట్రప్రభుత్వం ఆయనను 1966లో రజత పత్రంతో, 1969లో తామ్ర పత్రంతో సత్కరించింది. 1975లో ఆయనకు చిత్ర కళాప్రపూర్ణ సత్కారం లభించింది. సీనియర్ ఫెలోషిప్ (1988 లో భారతదేశ ప్రభుత్వం చే), 1992లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి చిత్రలేఖనంలో విశిష్ట పురస్కారం లభించింది. రాజయ్య 1993లో కళా ప్రవీణ, 1997లో కళా విభూషణ్, 2000లో హంస, 2007లో లలిత కళారత్న అవార్డు అందుకున్నారు. విదేశాల్లో సైతం ఆయన చిత్రాల ప్రదర్శనలు జరిగాయి. రాజయ్య చిత్రాలు పార్లమెంటు హౌస్, న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఆంధ్రప్రదేశ్ లలితా కళా అకాడమీల్లో ప్రదర్శనకు ఉంచారు.

గ్రామీణ పేదల జీవన వైవిధ్య భరితమైన అశేష అజరామర చిత్రాలకు ప్రాణం పోసి, తెలుగు వారి ప్రాచీన కళా రూపాల ను దిగంతాలకు పరిచయం చేసి తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన కాపు రాజయ్య 20 ఆగష్టు 2012 ఆగస్టు 20న 87వ ఏట తనువు చాలించి శాశ్వత చిత్తరువుగా జన హృదయాలలో నిలిచి పోయారు.

## ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటన

**ఢిల్లీ:** రష్యా దండయాత్రతో గత రెండేళ్లకు పైగా యుద్ధ భూమిలో నలిగిపోతున్న ఉక్రెయిన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఖరారైంది. ఆగస్టు 23న ఆయన కీవ్‌ను సందర్శిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇది ఎంతో ప్రాధాన్యత కలిగిన పర్యటన అని తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించేందుకు భారత్ ఎల్లప్పుడూ దౌత్యం, చర్చలను సమర్థిస్తుందని స్పష్టం చేసింది. ఆగస్టు 23న ప్రధాని మోదీ ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఉక్రెయిన్ కంటే ముందు ప్రధాని మోదీ ఆగస్టు 21న పోలండ్‌లో పర్యటించనున్నారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య తర్వాత ప్రధాని మోదీ కీవ్ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఇటీవల ఇటలీ వేదికగా జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ, జెలెన్‌స్కీ భేటీ అయిన విషయం తెలిసిందే. భారత్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన మోదీకి, ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫోన్ చేసి అభినందించారు. తీరిక చేసుకొని ఉక్రెయిన్‌లో పర్యటించాల్సిందిగా మోదీని కోరారు. ఈ నేపథ్యంలో మోదీ కీవ్ పర్యటనకు వెళ్లనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# దేశ క్రీడా రంగానికి కేంద్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీ ఉండాలని సీఎం తెలిపారు. యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, శిక్షణ సంస్థలన్నింటినీ స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే అవకాశం ఉన్న షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, ఆర్చరీ, జావెలిన్ త్రో, హాకీ వంటి క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. దేశం, రాష్ట్రంలోని భౌగోళిక పరిస్థితులు, ఇక్కడి యువత శారీరక నిర్మాణం తీరుకు అనువైన క్రీడలను గుర్తించి, వాటిని ప్రోత్సహించాలని సూచించారు.

ప్రతి క్రీడలో పతకాలు దక్కేలా తీర్చి దిద్దాలి

దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని సీఎం అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా, ప్రతీ క్రీడలో పతకాలు దక్కేలా రాష్ట్ర యువతను తీర్చిదిద్దాలన్నారు. ఆ దిశగా క్రీడా విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్ది, నిపుణులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పించాలని సీఎం తెలిపారు.

ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఒక స్పోర్ట్స్ స్కూల్

హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలన్నారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారుల శిక్షణపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతీ లోక్‌సభ నియోజకవర్గంలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ స్పోర్ట్స్ స్కూళ్లలో విద్యా బోధన చేస్తూనే, క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, అక్కడ రాణించిన వారిని మరింత పదును పెట్టేలా స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీ, క్రీడ విశ్వవిద్యాలయానికి యంగ్ ఇండియా పేరు ఖరారు చేయగా, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు కూడా యంగ్ ఇండియా పేరు పెట్టనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని సీఎం ఆకాంక్షించారు.

## మరింత వేగంగా జాతీయ రహదారుల నిర్మాణం

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులకు సూచించారు. సచివాలయంలో జాతీయ రహదారులపై ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి పలు జాతీయ రహదారుల నిర్మాణాల స్థితిగతులపై ఆరాతీసి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ...ఎన్.హెచ్ 65 ని ఆరు లేన్లుగా విస్తరించేందుకు.. డీపీఆర్ ను తయారు చేసేందుకు కన్సల్టెంట్ల నియామకానికి ఇప్పటికే టెండర్లు పిలిచామని.. త్వరితగతిన కన్సల్టెంట్లను నియమించి డీపీఆర్ సిద్ధం చేస్తామని ఆయన తెలిపారు. ఇక ఎన్.హెచ్ 65 పై 422.12 కోట్ల రూపాయలతో చేపట్టిన 17 బ్లాక్ స్పాట్ల పనులను నాణ్యత దెబ్బతినకుండా త్వరితగతిన పూర్తిచేయాలని ఎన్.హెచ్.ఏ.ఐ. అధికారులకు ఆదేశించారు.

మన్నెగూడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టేందుకు అపాయింటెడ్ డేట్ ను ఈ వారంలో ఖరారు చేస్తారని తెలిపారు. పనులు మొదలు పెట్టేందుకు కొన్ని చోట్ల ఇబ్బందిగా మారిన అటవీ అనుమతులు కూడా వచ్చినందున నిర్మాణ ప్రక్రియకు ఏ ఇబ్బంది లేదని ఆయన తెలిపారు.

నాగ్‌పూర్ - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయినందున అపాయింటెడ్ డేట్ వచ్చేలోగా పెండింగ్ లో ఉన్న భూసేకరణను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి కావాల్సిన 1941.65 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయ్యిందని.. రోడ్డు నిర్మాణంలో ఇప్పటి వరకు ఇబ్బందిగా మారిన అటవీ భూముల సమస్యకు.. మహబూబాబాద్ జిల్లాలో 73.04 హెక్టార్ల భూమిని కేటాయించి పరిష్కారం చూపించామని.. మిగిలిపోయిన అతికొద్ది భూసేకరణ కూడా సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. రైతుల భూములకు మంచి ధరలను ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని.. రైతులు అధైర్యపడకుండా భూసేకరణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, పీడీ హైదరాబాద్ నాగేశ్వర్ రావు, పీడీ గజ్వేల్ ఎన్హెచ్ ఏఐ మధుసూధన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన బాలికకు సీఎం బాసట

**విశ్వంభర, హైదరాబాద్:** తల్లి ఆత్మహత్యకు పాల్పడటంతో ఒంటరిగా మిగిలిపోయిన చిన్నారి దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు.. దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బు లేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్య, వైద్యం, ఇతర అవసరాలకు అండగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్ వెల్లడించారు. వైద్య, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

మంత్రి కోమటి రెడ్డి ఆర్థిక సాయం

బాలిక దుర్గకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం అండగా నిలిచిన విషయం తెలిసిందే. తన ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష నగదును తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్ ద్వారా అందించారు. ఈ నగదును స్థానిక అధికారుల చేత చిన్నారికి అందించారు. దుర్గ చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. బాలికకు ఇల్లు సైతం నిర్మిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు స్థానిక నేతలకు వీడియో కాల్ చేసి చిన్నారి దుర్గతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఖర్చుల నిమిత్తం ప్రతి నెలా డబ్బులు పంపుతానని, త్వరలో కలుస్తానని చెప్పారు. అనాథ బాలికను ఆర్థికంగా ఆదుకుంటామని స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ హామీ ఇచ్చారు. ఆమె విద్యాభ్యాసానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సిటీ పై సీజనల్ వ్యాధుల పంజా

(మొదటి పేజీ తరువాయి)

ఫలితంగా చాలా ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ అనుమానిత కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా బస్తీలు, మురికివాడల్లో అనారోగ్య లక్షణాలైన జ్వరం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, తలనొప్పి, దగ్గు, జలుబు వంటి లక్షణాలతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. దాదాపు ప్రతి కుటుంబంలో ఒక్కరైనా ఈ లక్షణాలతో ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో దోమల నివారణపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సి ఉంది. కానీ ఎండాకాలం నుంచి వానా కాలంలోకి ప్రవేశించిన సుమారు రెండున్నర నెలలు గడుస్తున్నా, జీహెచ్ఎంసీ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అంటూ లేకుండానే యాంత్రికంగా యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ వంటి మొక్కుబడిగా చేపడుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే మలేరియా, డెంగ్యూ అనుమానిత లక్షణాలతో వందలాది మంది క్లినిక్ లను ఆశ్రయిస్తున్నారు. వీటిలో డెంగ్యూ అనుమానిత కేసులే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. ప్రతి సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ మధ్య డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు లెక్కలు చెబుతున్నా, అధికారులు దోమల నివారణ కోసం రొటీన్ చర్యలు చేపడుతుండటం విమర్శలకు తావిస్తోంది. గత సంవత్సరం 2023లో జనవరి నుంచి జూలై మాసం వరకు 786 డెంగ్యూ కేసులు నమోదు కాగా, ఈ సంవత్సరం జనవరి నుంచి జూలై వరకు 413 కేసులు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి. చాలా మంది బస్తీ, మురికివాడ వాసులకు డెంగ్యూ లక్షణాలున్నా, వారు ప్రైవేటు క్లీనిక్ లు, నర్సింగ్ హోమ్ లలోనే చికిత్స పొందుతున్నందున మాస్ ఏరియాలోని డెంగ్యూ కేసులు రికార్డులకెక్కటం లేదన్న వాదనలున్నాయి.

**ఇదీ మ్యాన్ పవర్, మిషనరీ**

దోమల నివారణ కోసం ప్రతి వార్డుకు ఆరు ఎంటమాలజీ బృందాలు, ఒక్కో సర్కిల్ కు ఓ అసిస్టెంట్ ఎంటమాలజిస్టు, జోన్ కు ఒకరు చొప్పున సీనియర్ ఎంటమాలజిస్టు, మరో చీఫ్ ఎంటమాలజిస్టుతో కలిపి దాదాపు 2300 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు కొవిడ్ సమయంలో వీవీఐపీ, వీఐపీ ప్రాంతాల్లో కెమికల్స్ స్ప్రే చేసేందుకు నియమించిన మరో 200 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నా, గడిచిన కేవలం మూడు నెలల్లోనే దోమల నివారణకు సంబంధించి రకరకాలుగా అయిదు వేల నుంచి ఆరు వేల వరకు ఫిర్యాదులొచ్చాయంటే అధికారులు పని తీరును అంచనా వేయవచ్చు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని ఎంటమాలజీ విభాగంలో 302 పోర్టబుల్ ఫాగింగ్ మెషిన్లు, 63 పెద్ద ఫాగింగ్ మెషిన్లు ఉన్నట్లు సమాచారం. దీనికి తోడు వెయ్యి పవర్ స్ప్రేయర్లు, 920 మరో రకమైన స్ప్రేయర్లున్నాయి. ఇంత యంత్రాలు, సిబ్బందితో సుమారు 1700 మురికివాడల్లో 4846 కాలనీల్లో , ఇతర ప్రాంతాల్లో, భవనాల చుట్టూ దోమల నివారణ చర్యలును చేపట్టాల్సి ఉంది. దోమల బెడదకు సంబంధించి ఏరియా అసిస్టెంట్ ఎంటమాలజిస్టు లకు, సర్కిల్ ఆఫీసులకు, జోనల్ ఆఫీసులకు, ప్రధాన కార్యాలయాలకు ప్రతి రోజు వందకు పై చిలుకు ఫిర్యాదుల వస్తూ, కేవలం గడిచిన రెండున్నర నెలల్లో ఫిర్యాదులు పది వేలు దాటినట్లు సమాచారం.



వీఐపీ జోన్ కే పరిమితమైన ఫాగింగ్

మహానగరంలో దోమల నివారణ కోసం చేయాల్సిన ఫాగింగ్ కేవలం అసెంబ్లీ, సచివాలయం, రాజ్ భవన్, జీహెచ్ఎంసీ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్వార్టర్స్, మినిస్టర్ క్వార్టర్స్, ప్రగతి భవన్ పరిసరాలకే పరిమితమైనట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని 91 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మెజార్టీ కేంద్రాల్లో డెంగ్యూ అనుమానిత లక్షణాలున్న కేసులు ఎక్కువవుతున్నట్లు సమాచారం. కనీసం అంటువ్యాధులు ప్రబలే సమయంలోనైనా పేదలు నివసించే మురికివాడల్లో, మధ్య తరగతి ప్రజలు నివసించే బస్తీల్లో ఫాగింగ్ చేయాలని జనం కోరుతున్నారు.

**నెలల వారీగా నమోదైన డెంగ్యూ కేసులు**

| నెల | 2023 | 2024 |
|---|---|---|
| జనవరి | 56 | 105 |
| ఫిబ్రవరి | 46 | 58 |
| మార్చి | 56 | 42 |
| ఏప్రిల్ | 53 | 52 |
| మే | 58 | 43 |
| జూన్ | 133 | 89 |
| జూలై | 384 | 24 |
| మొత్తం | 786 | 413 |

## గురుకుల పాఠశాలలకు త్వరగా స్థల సేకరణ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ స్కూల్ భవనాల నిర్మాణాల కోసం ఆయా నియోజకవర్గాల్లో కావలసిన స్థల సేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వెంటనే డిజైన్లను కూడా రూపకల్పన చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ. 5 వేల కోట్లతో 30 కాంప్లెక్స్ లో 120 గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టడానికి కావలసిన అన్ని చర్యలను తీసుకోవాలని సూచించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలల ఉన్నత అధికారులతోరాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోని ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులను తెలంగాణ, దేశ సంపదగా భావిస్తున్నదని చెప్పారు. మానవ వనరులను అద్భుతంగా అభివృద్ధి చేసుకోవడానికి ఈ బడ్జెట్ లో విద్య కు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని అందుకు తగ్గట్టుగా అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణ ప్రాంతాల్లో 10 నుంచి 15 ఎకరాల స్థల సేకరణ చేయాలన్నారు. 8 నెలల్లో ఈ భవనాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం మొత్తం అడ్మిషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రతి విద్యార్థి మంచం పైనే పడుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ హాస్టల్స్, గురుకుల పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచం పైనే పడుకోవాలని తాము నిర్ణయం తీసుకున్నట్లు, అందుకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 1029 ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఇప్పటి వరకు మంచాలు, బెడ్స్, బెడ్ షీట్స్ ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎంత మందికి ఇవి కావాలి అనే జాబితాను త్వరగా తయారు చేసి తనకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. వాటిని వెంటనే పరిశీలించి కొనుగోలు చేయడానికి కావలసిన నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. అదే విధంగా ప్రతి గురుకుల పాఠశాల తో పాటు ప్రభుత్వ హాస్టల్స్ లో విద్యార్థిని, విద్యార్థులకు తప్పనిసరిగా టాయిలెట్స్ బాత్ రూమ్స్ , వాటర్ ఎలక్ట్రిసిటీ, వసతి గదులకు డోర్స్, విండోస్ ఉండాలని, విండోస్ నుంచి లోపలికి దోమలు రాకుండా ఉండడానికి కచ్చితంగా మెష్ ఏర్పాటు చేయాలన్నారు. వీటన్నిటిని క్రోడీకరిస్తూ విద్యార్థుల సౌకర్యాల కల్పనపై చెక్ లిస్టు తయారు చేయాలని సూచించారు. చెక్ లిస్టును ప్రతి హాస్టల్లో ప్రదర్శించాలన్నారు. గురుకులాల భవనాల అద్దె డబ్బులను త్వరలోనే చెల్లిస్తామని , భవనాల యజమానులు విద్యార్థుల సౌకర్యాల కల్పనకు నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల విద్యార్థుల సౌకర్యాల కల్పనకు కావలసిన వాటి గురించి చెక్ లిస్టు తయారు చేసి 29 లోగా తనకు సమర్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

**ఓవర్సీస్ స్కాలర్‌షిప్ విడుదలపై సానుకూలం**

విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ శాఖలో పెండింగ్ ఉన్న ఓవర్సీస్ స్కాలర్ షిప్ బకాయిల జాబితాను తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి సంవత్సరం నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్ షిప్ విడుదల చేయించుకునే బాధ్యత అధికారుల దేనిని గుర్తు చేశారు. ఈ వార్షికోత్సవంలో బీసీలకు 800, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు 500 మంది విద్యార్థులకు చొప్పున ఓవర్సీస్ స్కాలర్ షిప్ మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం ప్రకటించారు.

**పెద్దాపూర్ పాఠశాలపై సమీక్ష**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన తర్వాత అక్కడ తీసుకున్న చర్యల గురించి గురుకులాల సెక్రటరీ రమణకుమార్ ను ఆరా తీశారు. విద్యార్థులకు మంచాలు, బెడ్స్ యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా కింద పడుకోవడానికి వీలులేదని, ప్రస్తుతం ఉన్న భవనాలు సరిపోకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాల మైదానం ల్యాండ్ లెవెల్ చేయాలని, విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులోనే టాయిలెట్స్, బాత్ రూమ్ నిర్మాణం జరుగాలన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ కావలసిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. నూతన భవనాల నిర్మాణం కోసం కావాల్సిన ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, అలుగు వర్షిని, శరత్, తదితరులు పాల్గొన్నారు.

# పురోగతి ఉంటేనే సహకారం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఆయిల్ పామ్ పథకానికి సంబంధించి సర్కారుతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు తనకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పురోగతి చూపాలని, పురోగతి సాధించిన కంపెనీలకే ప్రభుత్వ సహకారం ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సచివాలయంలో రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు పథకం అమలుపై రాష్ట్రంలో పనిచేస్తున్న 14 కంపెనీల నిర్వహకులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఏ మాత్రం పురోగతి చూపని కంపెనీ నిర్వహకులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పురోగతి చూపని కంపెనీల మీద ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తూ, వేరే రాష్ట్రాలకు ఆయిల్ పామ్ గెలలను తరలించేందుకు తమ ప్రభుత్వం అనుమతించదని, ఆయా కంపెనీలు వెంటనే ఫ్యాక్టరీ నిర్మాణాలు చేసి, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ మొదలు పెట్టాలన్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని మంత్రి వ్యాఖ్యానించారు. కచ్చిత ప్రణాళిక లేకుండా, తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కంపెనీలు ప్రవర్తిస్తే ఏ మాత్రం సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.

ఆయిల్ పామ్ తోటలలో తొలి మూడు సంవత్సరాలు అంతరపంటలు పండించి ఆదాయాన్ని పొందే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పంట సాగుచేసే రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు తలెత్తకుండా, ఆయిల్ పామ్ చట్టానికి లోబడి పంట కొనుగోలు చేయాలని కంపెనీలను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగు, బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం ఎకరానికి మొదటి 4 సంవత్సరాలలో మొత్తం రూ.50,918 రాయితీ ఇవ్వడంతో, పెద్దఎత్తున ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. 202425 సంవత్సరానికి గాను, లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ప్రణాళిక చేసుకున్నట్లు చెప్పారు. క్ష ఇప్పటివరకు కేవలం 12 వేల 448 ఎకరాలలో మాత్రమే సాగులోకి తేవడం పట్ల మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచడానికి, సంబంధిత ప్రోత్సాహకాలను రైతులకు అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఆయిల్ పామ్ కు సంబంధించిన సబ్సిడీలు వెంటనే చెల్లిస్తున్నందున అన్ని కంపెనీలు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి స్థలాలను కొనుగోలు చేసి, ఫ్యాక్టరీ లను నిర్మించుకోవాలని మంత్రి ఆదేశించారు. ఫ్యాక్టరీ పూర్తయ్యే నాటికి ఒక్కో ఫ్యాక్టరీ పరిధిలో కనీసం 10 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ గెలలు వచ్చేలా సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన భూములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచుటలో తెలంగాణ రాష్ట్రం అన్ని రాష్ట్రాల కంటే ముందుండేలా అన్ని పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన సంచాలకులు మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ప్రతిరైతుకూ కచ్చితంగా రుణమాఫీ

**- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్రంలో జరిగిన రుణమాఫీ, దేశంలో ఇంతవరకు ఎప్పుడూ జరగలేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 తర్వాత బీజేపీ ఎప్పుడూ రుణమాఫీ గురించి మాట్లాడలేదన్న ఆయన, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ, రైతుల కోసం ఎలాంటి మంచి పనులు చేయలేదని విమర్శించారు.

రైతులను రుణ విముక్తులను చేయాలన్న దృఢ సంకల్పంతో తాము సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, వారికి కూడా నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే విపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

బీఆర్ఎస్ మళ్లీ వచ్చేది లేదు, సచ్చేది లేదు..

అధికారంలో ఉన్నా లేకపోయినా రైతులను మోసం చేయడమే బీఆర్ఎస్‌కు అలవాటన్న మంత్రి ఉత్తమ్ , వారి మోసపూరిత మాటలు నమ్మవద్దని రైతులను కోరారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చేది లేదు, సచ్చేది లేదని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ ప్రచారం కోసం మాత్రమేనని ఎద్దేవా చేశారు."కేంద్రంలో ఉన్న బీజేపీ ఏనాడూ రుణమాఫీ కోసం మాట కూడా మాట్లాడలేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి ఒక ఫ్లాగ్‌షిప్ స్లోగన్ పెట్టి రైతుల మేలు కోసం ఒక్క అడుగు వేయలేదు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం, గందరగోళ పరిస్థితులను చేస్తున్న విషయాలను యావత్తు తెలంగాణ రైతాంగం గమనించాలని మనవి చేస్తున్నామన్నారు.

ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది...

ఆధార్, రేషన్‌కార్డు వివరాలు సరిగా లేని దాదాపు 5 లక్షల మంది అన్నదాతల సమాచారంపై స్పష్టత వచ్చాక వారికి కూడా రుణమాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. వాటిని సవరించడానికి ప్రక్రియ మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. ఈ మేరకు ప్రతి మండలంలో మండల వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. వారు రుణమాఫీ కానీ రైతుల వివరాలను తీసుకొని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే రుణమాఫీ చేస్తామని వివరించారు.

కొన్ని ఖాతాల్లో వివరాలు సరిగా లేకపోవడం, రేషన్‌కార్డులు లేకపోవడం వల్ల రుణమాఫీ జరగలేదని మంత్రి తెలిపారు. మండల వ్యవసాయాధికారులు ఈ సమస్యలను పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ రూ.26 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, తాము అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టామని గుర్తు చేశారు. అర్హత ఉన్న ప్రతి కర్షకుడికి కచ్చితంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై రేపటి నుంచి పీసీ ఘోష్ కమిషన్ బహిరంగ విచారణ

**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలకు సంబంధించిన అంశాలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, బుధవారం నుంచి బహిరంగ విచారణ చేపట్టనుంది. ఇప్పటి వరకు అఫిడవిట్లు దాఖలు చేసిన అధికారులను హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో విచారణ చేయనున్నారు. అఫిడవిట్లలోని అంశాల ఆధారంగా జస్టిస్ పీసీ ఘోష్ వారి ని ప్రశ్నించనున్నారు. కమిషన్ తరపున మొదట న్యాయవాదిని నియమించుకోవాలని అనుకున్నప్పటికీ, వివిధ కారణాలతో సాధ్యం కాకపోవడంతో నేరుగా జస్టిస్ పీసీ ఘోష్ వారిని ప్రశ్నించనున్నారు. కాళేశ్వరం ఆనకట్టల అంశాలపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇప్పటికే విచారణ చేసిన నేపథ్యంలో అందుకు సంబంధించిన మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిషన్ ఆదేశించింది.

**అదనపు సమాచారంపై ఆరా**

మరోవైపు సోమవారం విజిలెన్స్ డీజీ సీవీ ఆనంద్ జస్టిస్ పీసీ ఘోష్ ముందు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల అంశాలకు సంబంధించి విజిలెన్స్ విచారణ గురించి ఆయన వివరించారు. మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని సీవీ ఆనంద్ కమిషన్‌కు తెలిపారు. మరికొన్ని అంశాల గురించి కూడా సీవీ ఆనంద్‌ను ఆరా తీసిన జస్టిస్ పీసీ ఘోష్, అదనపు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రాజెక్టు విచారణపై తుది నివేదిక కూడా త్వరగా ఇవ్వాలని కమిషన్ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై విచారణ నిమిత్తం నీటి పారుదల శాఖ నుంచి తీసుకున్న దస్త్రాలు, వివరాలు కూడా కమిషన్ అడిగినట్లు తెలిసింది. వాటిని స్వాధీనం చేయాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, నీటి పారుదల శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

త్వరలో సోమేశ్ కుమార్‌కు నోటీసులు : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటి వరకు 57 మంది అధికారులు పీసీ ఘోష్ కమిషన్‌కు అఫిడవిట్లు దాఖలు చేశారు. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ ఇంకా అఫిడవిట్ దాఖలు చేయలేదని సమాచారం. కమిషన్ నుంచి మరోమా రు ఆయనకు నోటీసులు పంపనున్నట్లు తెలిసింది. త్వరలోనే గత ప్రభుత్వ పెద్దలకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్టు రీడిజైనింగ్, నిర్మాణ స్థలం ఎంపిక, విధానపర నిర్ణయాలు, సంబంధిత అంశాలపై గత ప్రభుత్వ పెద్దలను ప్రశ్నించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## త్వరలోనే పటిష్ఠమైన రెవెన్యూ చట్టం

**- పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో త్వరలో పటిష్ఠమైన రెవెన్యూ చట్టం తీసుకు వస్తామని ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నింటికీ సబ్ కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బేగంపేట హరిత ప్లాజా హోటల్ లో ట్రెసా ఆధ్వర్యంలో జరిగిన నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా చర్చా వేదిక కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఏ చట్టంలోనైనా లొసుగులు లేకుండా సరిదిద్దకపోతే, వేలాది కుటుంబాలు రోడ్డు పాలవుతాయని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వమైనా చట్టాలు సరిగా రూపొందించకపోతే, ఆ ఫలితాలు సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ధరణి స్థానంలో అత్యంత పారదర్శకంగా కొత్త రెవెన్యూ చట్టం తీసుకొచ్చే క్రమంలో సామాన్యుల నుంచి మేధావుల వరకు అన్ని స్థాయిల్లో అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

నూతన చట్టం రూపకల్పన : కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరూ ముక్కున వేలు వేసుకునేలా, కొత్త రెవెన్యూ చట్టం తీసుకొస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. అది దేశానికి ఓ నమూనాగా ఉండబోతోందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, రెవెన్యూ శాఖలో అన్ని స్థాయిల్లో పదోన్నతులు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ట్రెసా, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులుకు మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు.

కొత్త ఆర్ఓఆర్ చట్టంపై సలహాలు, సూచనల స్వీకరణలో భాగంగా ఆయా వర్గాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. గతంలో వీఆర్ఓలుగా పనిచేసి ఇతర శాఖల్లోకి వెళ్లిన వారందరినీ మళ్ళీ రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలని మంత్రి పొంగులేటికి ట్రెసా విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో భూ చట్టాల రంగ నిపుణులు ఎం.సునీల్‌కుమార్, ట్రెసా అధ్యక్ష కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, గౌతంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాఖీపౌర్ణమి వేడుకలు

విశ్వంభర, భూపాలపల్లి/రామన్నపేట/మహాదేవ్ పూర్ : భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో మహిళా నేత అన్నమనేని అరుణ స్వగృహంలో సామరస్యత వెల్లివిరిసేలా, కుల,మతాలకు అతీతంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. యువ నాయకుడు మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ , జాగృతి మహేష్‌కు రాఖీ కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి గుర్తుగా ప్రతి ఇంటా రాఖీ పండుగ జరుపుకోవడం మహిళలకు చాలా సంతోషంగా ఉంటుందని అన్నమనేని అరుణ అన్నారు. రక్షా బంధమై సోదరుని నుండి సోదరి దీవెనలు పొందాలని కోరుకుంటుందని, సాంప్రదాయ,సంస్కృతి ప్రధానమైన పండుగల్లో రాఖీ ఒకటని, రవీంద్రుడు తన శాంతినికేతన్ లో ఆచరించి చూపించాడని అన్నారు.

రామన్నపేటలో...

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఆధ్వర్యంలో రక్షాబంధన్ ఉత్సవం రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో రక్షాబంధన్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

మహాదేవ్ పూర్‌లో..

రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకొని మాజీ ఎంపిపి రాణిభాయి రామారావు తహశీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ కు రాఖీ కట్టారు. కుల , మత ప్రాంతీయ బేధాలు లేకుండా జరుపుకునే పండగ రాఖీ పండగ అని అన్నారు.





భూపాలపల్లి : మైనారిటీ నేత సల్మాన్ ఖాన్‌కు రాఖీ కడుతున్న మహిళా నేత అన్నమనేని అరుణ



నల్గొండ జిల్లా, చందూరులో అన్నకు ఆప్యాయంగా రాఖీ కట్టిన




మహాదేవ్ పూర్ : తహసిల్దార్‌కి రాఖీ కట్టిన మాజీ ఎంపీపీ



## ఓంకారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**విశ్వంభర, మెట్ పల్లి:** స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో గల శ్రీ ఓంకారేశ్వర స్వామి అనుబంధ దేవస్థానం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం లలో శ్రావణ పౌర్ణిమ సోమవారం పరమశివుని అనుగ్రహం కొరకు పవిత్ర మాసం శ్రావణం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు అభిషేకాలు నిర్వహించారు. మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఆర్యవైశ్య సంఘ సభ్యులు భక్తులకు సహకరిస్తూ తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## ఫోటో సజీవ సాక్ష్యానికి నిదర్శనం




విశ్వంభర, ఆమనగల్లు : ఆమనగల్లు మండల కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఒక ఫోటో సజీవ సాక్షానికి నిదర్శనం అని ఎన్నో భావాలను ఒక చిత్రంతో తెలిపేదే ఫోటోగ్రఫీ అని ఫోటోగ్రాఫర్ నాయకులు తెలిపారు. సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురె జయంతిని పురస్కరించుకునే నిర్వహించే ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఆమనగల్ పట్టణంలో ఫోటోగ్రాఫర్ సంఘం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ సంఘం అధ్యక్షులు కాడిగే సత్యం, ఉపాధ్యక్షులు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి జావేద్ , కోశాధికారి వెంకటేష్ యాదవ్, ఎంఏ అలీం, జబ్బార్, యాదగిరి, నాజర్ , శ్రీకాంత్, మహేష్ , రాజు, నరసింహ , శేఖర్ .గఫార్ , ఖలీమ్ రఫీ , ప్రవీణ్ రెడ్డి, గణేష్ ,శ్రీశైలం,మహేష్, పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రహీంఖాన్ పేట గ్రామములో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దుంప ఇదయ్య కూతురు రేణుక అనారోగ్యంతో సోమవారం రోజు చనిపోవడం జరిగింది.వారి కుటుంబానికి బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు కోప్పుల హరిదీప్ రెడ్డి 5000 వేల రూపాయలు ఆర్థికసాయం అందించారు.వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుదగాని లింగయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు అంజయ్య, కర్రే అయిలయ్య, నియోజకవర్గ యూత్ కార్యదర్శి బండి నరేష్, బూడిద మహేష్, గ్రామ నాయకులు కర్రే మల్లయ్య, గుండ కోటి లింగం, దుంప శివయ్య, దుంప రవి, సుధగాని లక్ష్మీ నరసయ్య పాల్గొని వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది అంటు యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కోల్ కత్తా లో జూనియర్ డాక్టర్ పై అత్యాచారం హత్య చేసిన దుండగులపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీన కలకత్తాలో అర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పటల్ నైట్ డ్యూటీలో ఉన్న ఓ మహిళ వైద్యురాలని అత్యాచారం చేసి హత్య గావించారు. అవమానకరంగా ఘటనపై దేశవ్యాప్తంగా అన్ని వైద్య ఆసుపత్రులలోని వైద్య విద్యార్థులు డాక్టర్లు నిరసన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సిపిఐ మండల కార్యదర్శి గాధగాని మాణిక్యం మండల కార్యవర్గ సభ్యులు ఆలేటి బాలరాజు పల్లె వెంకన్న బోల్ల శ్రీనివాసు, బీరకాయల మల్లేశం, సుధగాని వెంకన్న, జీవకలపల్లి పాండు, బోలగాని అశోకు, పల్లె శీను, రేపు పాండు, బీరకాయ నరసింహులు, సిద్దుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డికి బ్రహ్మ కుమారిలు రాఖీ కట్టారు.

- విశ్వంభర, హైద్రాబాద్



## సుడా పరిధిలోని గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులకు పదిహేడు శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలి

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కి పిఆర్టియు జిల్లా శాఖ విజ్ఞప్తి

**విశ్వంభర, కరీంనగర్ :** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం సుడా కార్యాలయంలో చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చము ఇచ్చి శాలువతో సన్మానించారు . అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పెరిగినందున పిఆర్సి 2020 జీవో 53 ప్రకారం ఇక్కడి నుండి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలలో పనిచేసే ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పదిహేడు శాతం ఇవ్వాలని కోరారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్ ను కలువగా ఆర్ అండ్ బి ఎస్ఈ కి రాశారని త్వరగా సర్వే చేయించి హెచ్ఆర్ఏ పరిధిలోని గ్రామాలను గుర్తించాలని సంఘం నాయకులు నరేందర్ రెడ్డిని కోరారు.ఇతర జిల్లాలలో గత సంవత్సరం నుండి అమలవుతున్నదని సంఘం నాయకులు పేర్కొన్నారు.ఈ జిల్లాలో కూడా త్వరలో అమలు కావడానికి అధికారులతో మాట్లాడి ఉత్తర్వులు ఇప్పించడానికి కృషి చేస్తానని నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారని సంఘం నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు జాలి మహేందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జమీల్, అన్నాడి మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వివిఎల్ఎన్, మహిపాల్ రెడ్డి, జీవన్ రెడ్డి, గౌస్ ఖాన్, జిల్లా కార్యదర్శిలు కంది శ్రీనివాస్ రెడ్డి, మందల శ్రీనివాసరెడ్డి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మనోహర్ రెడ్డి, పరశురాములు,మల్లారెడ్డి,మల్లేశం అంజద్ తది తరులు పాల్గొన్నారు.

## త్రిశక్తి మాత దేవాలయంలో చండీ హోమం



**విశ్వంభర, మెట్ పల్లి :** శ్రావణ మాస సోమవారం పౌర్ణమి సందర్భంగా త్రిశక్తి మాత దేవాలయంలో చండీ హోమము పూర్ణాహుతి నిర్వహించారు. వర్షాలు అధికంగా కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని సకల జనులకు ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలు కలగాలని ఆలయ వేద పండితులు హోమం నిర్వహించారు. విధిమౌళి శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ , చండీ హోమం సంపూర్ణంగా నిర్విఘ్నంగా జరిపారు . అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. త్రిశక్తి మాత దేవాలయంలో చండీ హోమం నిర్వహించారు.

### షరతులు లేకుండా

## రెండు లక్షల రుణమాఫీ చేయాలి



మెట్ పల్లిలో..

**విశ్వంభర, మెట్ పల్లి/ కామారెడ్డి :** మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో గ్రామ రైతాంగం అంతా ఒక్కటై రిలే నిరాహారదీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ కట్ ఆఫ్ డేట్లు లేకుండా, ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వెంటనే వచ్చే విధంగా ప్రభుత్వం చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని, అలాగే మా ముత్యంపేట్ ఇండియన్ బ్యాంకులో ఉన్న కట్ ఆఫ్ తేదీ సమస్యలను పరిష్కరించి మా రైతులందరి మనోవేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని 2 లక్షల రుణమాఫీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు..

రైతులు తలపెట్టిన ఈ రిలే నిరాహార దీక్ష విషయం తెలుసుకున్న మెట్ పల్లి CI , మల్లాపూర్ ఎస్సై కిరణ్ కుమార్ వచ్చి ఈ నిరాహార దీక్షను విరమించాలని కోరగా ప్రభుత్వం తరుపున స్పష్టమైన వైఖరి వ్యవసాయ శాఖ అధికారులు తెలుపే వరకు దీక్షని కొనసాగిస్తామని చెప్పడంతో వెంటనే వారు పైఅధికారులకు మండల ఎమ్మార్వో వీర్ సింగ్, మండల వ్యవసాయ శాఖ అధికారిని లావణ్య దీక్షా శిబిరానికి చేరుకొని మీయొక్క డిమాండ్ లను జిల్లా కలెక్టర్, జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తామని, వారం రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పి రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి రైతులకు రాఖీ కట్టి వారి నిరాహారదీక్షను విరమింపజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ నెల రోజుల్లో మాకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చెయ్యని యెడల మేమంతా కలిసి ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని డిమాండ్ చేసారు. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో రైతులు జిల్లా వ్యవసాయ అధికారి వాణి ,ఎమ్మార్వో వీర్ సింగ్ పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లాలో..

### కామారెడ్డి జిల్లాలో..

పిట్లం మండలంలో రాంపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున దక్కన్ గ్రామీణ బ్యాంక్ ఎదుట మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి యాదగిరి లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పారని 15వ తేదీ రెండు లక్షల అవుతుందని చెప్పారని ఇంతవరకు కాలేదని వెంటనే రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

## పాండు కుటుంబానికి మాజీ జెడ్పిటిసి సానుభూతి

**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల కేంద్రంలోని సాలార్పూర్ గ్రామానికి చెందిన నేనావత్ పాండు అనారోగ్య కారణాలతో చనిపోయారు. స్థానిక నాయకుల నుండి విషయం తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నుండి 5వేల రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం క్రింద ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా సాలర్పూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ ప్రియా రమేష్ కూడా మూడువేల రూపాయలు అందజేశారు. బాధిత కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు,బాబా, ప్రకాష్ రాజు, అంజయ్య, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూలు పూర్ణిమ గాయత్రి మహాయజ్ఞం

విశ్వంభర, ఆమనగల్లు/మెట్ పల్లి/చండూరు : ఆమనగల్లు భక్త మార్కండేయ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి సహిత భక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం 38వ నూలు పూర్ణిమ గాయత్రి యజ్ఞం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురి పాల్గొన్నారు. పద్మశాలీలు పెద్ద ఎత్తున గాయత్రి ధారణ కార్యక్రమంలో పాల్గొని, రక్షాబంధనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం పురాతన శివాలయం నుంచి మార్కండేయ స్వామి చిత్రపటాన్ని ఊరేగించి మార్కండేయ దేవస్థానంలో అఖండ భజనలు చేశారు. సోమవారం ఉదయం గాయత్రిధారణ అనంతరం గుజ్జరి ప్రవీణ్ తండ్రి మాజీ సర్పంచ్ గుజ్జరి పెద్దయ్య జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బివనపల్లి దుర్గయ్య, అవారి శివలింగం, గాజుల సత్య రాములు, గాజుల శ్రీనివాస్, పున్న శ్రీను, దోర్నాల ఈశ్వరయ్య, మామిడి శెట్టి రవి, చెరుకు రవి, పాలాది శ్రీను, గుర్రం సురేష్, ఎంగలి ప్రసాద్, గుజ్జరి ప్రవీణ్, ఏలే శివలింగం, సోమశంకర్, గంజి శ్రీను, యంగలి రఘు, ఆరుగొండ మధుసూదన్, గ్రామ పద్మశాలీ యువకులు పెద్ద సంఖ్యలో మహిళలు యువతులు పాల్గొన్నారు.

సామూహిక యజ్ఞోపవీత ధారణ



మెట్ పల్లిలో..



ఆమనగల్లులో...

శ్రావణ పూర్ణిమ (జంధ్యాల పూర్ణిమ) సందర్భంగా శివ, భక్త మార్కండేయ మందిరంలో ఉద యత్ పూర్వం స్వామివారి సుప్రభాత సేవ, మార్కండేయ మందిరం నుండి మార్కెట్ సమీపంలో గల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయం వరకు పల్లకి సేవ (శోభయాత్ర )నిర్వహించారు. అనంతరం పద్మశాలి కుల బంధువులు అందరూ మూలవిరాట్ విగ్రహానికి పంచామృత అభిషేకం విగ్రహమునకు రుద్రాభిషేకం, యజ్ఞోపవిత (గాయత్రి )ఆరాధన నిర్వహించారు. పద్మశాలి కుల బంధువులు సామూహికంగా యజ్ఞోపవిత ధారణ వేద పండితుల గాయత్రి మూలమంత్ర ఉచ్చరణల మధ్య స్వీకరించారు, కార్యక్రమానికి మెట్ పల్లి పట్టణ పద్మశాలీలు హాజరయ్యారు.

సనాతన ధర్మానికి ప్రతీక

రక్షా బంధన్ పండుగను పురస్కరించుకొని నల్గొండ జిల్లా, చండూరు మండల కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో రాఖీ పౌర్ణమి (జంధ్యాల పూర్ణిమ) పద్మశాలీలు గాయత్రీధారణ (జంధ్యం ధారణ) ఘనంగా చేపట్టారు. గాయత్రీ హోమం నిర్వహించడంతో పాటు శ్రీ భక్త మార్కండేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ అర్చకులు గుర్రం సత్యనారాయణ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ఆచారాలతో పాటు, సంస్కృతి సాంప్రదాయాలను పాటించడం మరవకూడదు అని అన్నారు. మన ఆచారాలు భవిష్యత్తు తరాలకు బాటలు వేసి మార్గదర్శకం కావాలని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని ఆచార వ్యవహారాలు , భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక భావనతో సర్వేజనా సుఖినోభవంతు అనే వాక్కుతో ప్రపంచమంతా చల్లగా వర్ధిల్లాలి అనే భావించే ఒకే ఒక్క మతం హైందవ మతం అని, దేశం భారతదేశం అని తెలిపారు. రక్షా భంధన్ అన్న చెల్లెళ్ల, అక్క తమ్ముళ్ళ ఆప్యాయత, అనురాగాలు కు భంధాలు బలంగా ఉంటాయని తెలిపారు. గాయత్రీ ధారణ లో పెద్ద ఎత్తున పద్మశాలీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రావిరాల నగేష్ ,గుర్రం భిక్షమయ్య, కోమటి వీరేశం, గుంటి వెంకటేశం, చిలుకూరి శ్రీను, తిరందాసు శ్రీను, గంజి శ్రీను, ఏలే చంద్ర శేఖర్, గంజి యాదగిరి, చిట్టిప్రోలు వెంకటేశం, చిట్టీప్రోలు మహేష్, ఏలే సుధాకర్ ,అర్చకులు చేరుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



చండూరు : మార్కండేశ్వర దేవాలయంలో..

# అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీక రక్షాబంధన్

**విశ్వంభర, ఎల్బీనగర్/కుత్బుల్లాపూర్:** అన్నా చెల్లెళ్ల అనురాగ బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రక్షాబంధన్ పండుగ వేడుకలు ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోనీ నివాసంలో ఘనంగా నిర్వహించారు. చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రేమ అనుబంధాలు చిరకాలం నిలిచేలా అన్ని వేళలా తోడుగా ఉండేలా జరుపుకునే వేడుకే రాఖి పండగ అని అన్నారు.

అన్న చెల్లెళ్ల అనురాగ బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని సరూర్నగర్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. సోమవారం రక్షాబంధన్ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి, అడ్మిన్ ఎస్ఐ మారయ్య గౌడ్, ఎస్సై లు కిషన్, గంగాధర్ రెడ్డి, సిబ్బందిలకు రాఖీలు కట్టారు. ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రేమ అనుబంధాలు చిరకాలం నిలిచేలా అన్ని వేళలా తోడుగా ఉండేలా జరుపుకునే వేడుకే రాఖీ పండగ అని అన్నారు.

### ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన మహిళా సోదరీమణులు, నాయకురాళ్లు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను కలిసి రాఖీలను కడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలలో ప్రతీ పండుగలలో ఒక పరమార్థం దాగివుందని, సోదరభావాన్ని పెంచే ఈ రాఖీ పర్వదిన వేళ మహిళా సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. నేడు రాజకీయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నేను హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడంలో మహిళా సోదరీమణుల కృషి ఎంతగానో ఉందని ఈ సందర్భంగా వారికి మరోమారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు..

రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద కలిసి, రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనుబంధాల వేడుకను ఆనందోత్సాహలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షిస్తూ మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అక్కా చెల్లెళ్లందరికీ ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, మహిళల రక్షణ, సంక్షేమం, సాధికారత విషయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీపడరని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.















# ఘనంగా గోదావరి పౌర్ణమి హారతి

**విశ్వంభర, భూపాలపల్లి :** దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ,హైదరాబాద్ ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి రోజున గోదావరి నదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు . అందులో భాగంగా భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో ముఖ్య అర్చకులు పనకంటి ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం నుండి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో, గోదావరి నది వద్దకు వెళ్లి గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెంట్ బుర్రి శ్రీనివాస్ , మాజీ ధర్మకర్త శ్యాంసుందర్ దేవుడా, దేవస్థానం సిబ్బంది, కాలేశ్వరం గ్రామస్తులు ,భక్తులు, మహిళలు, పాల్గొన్నారు.

# 185 వ ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవ వేడుకలు



**విశ్వంభర , నారాయణపూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో స్థానిక చౌరస్తాలో మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి లింగస్వామి ఆధ్వర్యంలో 185వ వరల్డ్ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు . అనంతరం వృద్ధులకు ఫోటో గ్రాపర్స్ పండ్లను పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో అద్భుతాలను చిత్ర విచిత్రాలను బంధించాలంటే ఒక ఫోటోగ్రాఫర్ కు దక్కుతుందన్నారు, పెళ్లి సందడిలో శుభ కార్యాలయాలను బంధించి బహుమతిగా అందజేసే వాడే ఫోటో గ్రాఫర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పాలకూర్ల యాదయ్య, కొండ శ్రీకాంత్, ఫోటోగ్రాఫర్స్ మండల ఉపాధ్యక్షులు గంగాపురం సాయి గౌడ్, మందుగుల సాయి కిరణ్, బొంగు మధు, వంగరి సాయి, అందె నరేష్, కొండ నవీన్ ఫోటో గ్రాపర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఎన్నికలకు ఇంచార్జ్ గా మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి

**విశ్వంభర, కడ్తాల్ :** త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రకు కాంగ్రెస్ ఎన్నికల ఇన్చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ జాతీయ కాంగ్రెస్ వార్ రూమ్ ఛైర్మన్ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వంశీకి అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించడంతో కడ్తాల్ మండల కాంగ్రెస్ నాయకులు, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసే వరకు ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్చార్జిగా కొనసాగుతారని తెలిపారు.



# నాంచారిపేటలో ఘనంగా కామరతు బీరప్ప బోనాలు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మూట కొండూరు మండలం నాంచారి పేట గ్రామంలో కామరతు దేవి బీరప్ప దేవుడు, అక్క మాంకాలమ్మ , బుగ్గ పోచమ్మలకు ఘనంగా మహిళలందరూ బోనాలు సమర్పించారు. దేవాది దేవతలకు పట్టుచీరలు దోతులు దేవుళ్ళకు కట్టించి ఒడిబియాలు పోశారు. దేవాది దేవతలకు నైవేద్యాలు సమర్పించి ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ బచ్చ సిద్దయ్య, సొల్లోజు బచ్చ పార్వతాలు, కప్ప సత్తయ్య, బచ్చ గణేష్, వెంకన్న, బీరు మల్లయ్య ,మహేందర్, సందీప్, మహేందర్, నరేష్ ,తాజా మాజీ ఉపసర్పంచ్ కప్ప మల్లేశం, బచ్చ శ్రీశైలం, బచ్చ శ్రీధర్, శీను, శ్రీనివాస్, రమేష్ మహేందర్, గొర్రెల పెంపక దారుల సహకార సంఘం అధ్యక్షులు కానగంటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించినా రెవెన్యూ ఉద్యోగులు.

- విశ్వంభర, హైద్రాబాద్



# ఘనంగా బోనాల ఉత్సవాలు

**విశ్వంభర, బషీర్ బాగ్ :** బషీర్ బాగ్ లోని ఎస్సిఈఆర్టి లో దుర్గ మాత బోనాల ఉత్సవాలను రవీందర్ లక్ష్మణ్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్జెడిఎస్సి శాస్త్రి, టీఎన్జీవోస్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్ రాజ్ కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులను, టీఎన్జీవోస్ నేతలను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు సంఘానికి పేరు తీసుకురావాలని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురి ఉన్నతమైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు వనం శ్రీ చందన, గుద్దేటి నిహారిక, వంశీకృష్ణలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు యంగలి బాలకృష్ణ, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి అవ్వారి శివలింగం, కోశాధికారి గాజుల సత్య రాములు, గాజుల శ్రీను, మామిడి శెట్టి రవి, చెరుకు రవీందర్, ఎంగలి ప్రసాద్, పున్న వెంకటేష్, పాలాది శీను, అప్పం అలివేలు యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలకత్తా తరహా ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి



**విశ్వంభర ,ఎల్బీనగర్ :** కలకత్తా లో వైద్య విద్యార్థిని పై అత్యాచారం తరహా సంఘటనలు చోటు చేసుకోకుండా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్లు నర్సులపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కోల్ కత్తా వైద్య విద్యార్థి పై దారుణానికి పాల్పడిన నిందితుడి పై కఠిన చర్యలు తీసుకోవాలని సిబిఐ కేసును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడిని వెంటనే శిక్ష పడిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఉస్మానియా, గాంధీ, ఆసుపత్రుల ప్రిన్సిపల్ ఆసుపత్రులు సూపరిండెంట్లకు డాక్టర్లు నర్సింగ్ ఆఫీసర్లు వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల రక్షణ భద్రతపై ఇప్పటికే షీ టీమ్స్ కఠినంగా వ్యవహరిస్తున్నాయని టీ జూడ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తిలో భాగంగా వర్క్ స్టేషన్లలో మహిళా డాక్టర్ల భద్రతకు తీసుకోవలసిన అంశాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పశ్చిమ బెంగాల్ ( కలకత్తా లో) వైద్య విద్యార్థిని అత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఏది ఏమైనా వైద్యులపై దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు.

## వన మహోత్సవం గడిచి వారం కాలేదు, అప్పుడే ..

# పల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికివేత






**విశ్వంభర, చింతపల్లి :** రాష్ట్రం వ్యాప్తంగా చెట్లు పెంచి పర్యావరణంలో మార్పులు తెచ్చి ఆకుపచ్చ తెలంగాణలా మార్చాలన్న ప్రభుత్వం ఆలోచనలను తారమారు చేస్తున్న కొందరు ఆకతాయిలు చెట్లు పెట్టాల్సింది పోయి పల్లె ప్రకృతి వనంలోని చెట్లను నరికి వేస్తున్న సంఘటన చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మల్లారెడ్డిపల్లి పల్లె ప్రకృతి వనంలోని సుమారు 65 చెట్లను కొందరు వ్యక్తులు నరికివేశారు. పల్లె ప్రకృతి వనంలో సుమారు 2000 కానుగ, అడవి తంగేడు, ఇతర పండ్ల మొక్కలను సుమారు 5లక్షల రూపాయలు వెచ్చించి ఐదు సంవత్సరాల క్రితం నాటారు. ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు అదును చూసి ఆ చెట్లను సోమవారం నరికి వేశారు. ఈ విషయమై మల్లారెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి సత్యనారాయణకు గ్రామస్తులు సమాచారం ఇవ్వగా పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి అధికారుల ఆదేశాలు లేకుండా చెట్లు నరికి వేసారని నిర్ధారించిన పంచాయితీ కార్యదర్శి స్థానిక ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఓ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విచారణ జరిపి ఆట్టి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లలో కూడా కార్యదర్శి పిర్యాదు చేసారని సమాచారం. ఈ వ్యవహారం చింతపల్లి మండలంలో చర్చనీయాంశమైంది. ఒకేసారి 65 చెట్లు నరికి వేయడంతో ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రాంగ్ రూట్లో వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**విశ్వంభర, ఆమనగల్లు :** అమనగల్ పట్టణం లోని మార్కెట్ యార్డ్స్ సమీపంలో కల్వకుర్తి నుండి ఆమనగల్ వైపుకు ప్రమాదకరంగా రాంగ్ రూట్లో ఆటోను నడుపుతున్న వ్యక్తిని ఆమనగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమనగల్ పట్టణానికి చెందిన జంతుక వంశీ తండ్రి రాములు తన ఆటో ప్రమాదకరంగా నడుపుకుంటూ రోడ్డుపైన వెళుతున్న వాహనదారులకు , పాదాచారులకు ఇబ్బంది కలిగిస్తూ డ్రైవింగ్ నియమాలు అతిక్రమించి ప్రమాదకరంగా నడుపుతున్నడని షాద్నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు చెందిన హైవే పెట్రోల్ మొబైల్ ఇన్చార్జ్ ఏఆర్ ఎస్ ఐ కిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆటోను పోలీస్ స్టేషన్ తరలించామని ప్రజలకు ఇబ్బందికరంగా రాంగ్ రూట్ లో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేశారు. సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా ఉన్నారు.

- విశ్వంభర, హైద్రాబాద్

# జాతీయ రహదారి డివైడర్ పై గుర్తు తెలియని మృతదేహం

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండల కేంద్రంలోని అపోలో మెడికల్ షాప్ ముందు హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ మీద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఆచూకీ తెలిస్తే ఆమనగల్లు పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని ఎస్సై వెంకటేష్ తెలిపారు. అతని ఎత్తు 5'2, అడుగులు, వయస్సు దాదాపు 55 నుండి 58 సంవత్సరాల మధ్య ఉంటుందని, నీలిరంగు చొక్కా, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడని ఇట్టి వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టినచో ఆమనగల్ పోలీస్ స్టేషన్ లో తెలియజేయగలరని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



# అక్టోబర్ 4 నుంచి తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు..

**విశ్వంభర, తిరుమల:** కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగనున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఏడాది పొడువునా 450 ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఇందులో బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్ఠత ఉన్నది. అక్టోబర్ 3న ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉదయం, రాత్రి వేళల్లో ఒక్కో వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. 4న సాయంత్రం 5.45 గంటలకు ధ్వజారోహణం కార్యక్రమం జరుగుతంది. బ్రహ్మోత్సవాలకు ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు.



ధ్వజస్తంభంపైకి గరుడ పతాకం ఎగురవేసి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. ఈ సందర్భంగా రుత్వికులు వేదమంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూచుడతారు. ఇక రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు పెద్దశేష వాహన సేవపై తిరుమాడ వీధుల్లో విహరిస్తారు. రెండోరోజైన 5న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, రాత్రి 7 గంటల నుంచి 9 వరకు హంస జరుగుతుంది. 6న ఉదయం సింహ వాహనసేవ, రాత్రి ముత్యపు పందిరి, నాలుగో రోజున ఉదయం కల్పవృక్షం వాహనం, రాత్రి సర్వభూపాల వాహన సేవపై శ్రీవారి భక్తులను అనుగ్రహిస్తారు. ఐదోరోజున ఉదయం మెహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకు శ్రీవారి గరుడ వాహనంపై భక్తకోటిని కటాక్షిస్తారు. ఉత్సవాల్లో ఆరో రోజున ఉదయం హనుమంత వాహనసేవ, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు స్వర్ణ రథం, రాత్రి 7 నుంచి 9 వరకు గజ వాహన సేవ జరుగుతుంది. ఏడో రోజున ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవలను నిర్వహిస్తారు.

ఎనిమిదో రోజున ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ జరుగుతుంది. చివరి రోజైన తొమ్మిదో రోజున ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చక్రస్నానం, రాత్రి 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండు, మూడు, నాలుగో రోజుల్లో మధ్యాహ్నం సమయంలో రంగనాయకుల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు స్నపనం తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇక బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం భారీ ఏర్పాట్లు చేస్తున్నది. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ వాహనసేవకు లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఏపీలో కరవు అనే మాట వినిపించకూడదు: చంద్రబాబు



**విశ్వంభర, నెల్లూరు:** రాష్ట్రంలో కరవు అనే మాట వినిపించకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్లో.. ఇప్పుడు వ్యవసాయానికి గడ్డు పరిస్థితి వచ్చిందన్నారు. నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లిన ఆయన.. సోమశిల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉన్మాద, రాక్షస పాలన నుంచి బయటకు వచ్చామన్న ఆయన.. రాష్ట్ర ప్రజలకు స్వాతంత్య్రం వచ్చిందని అందరూ హాయిగా ఉన్నారని చెప్పారు.

"ప్రజాస్వామ్యంలో బాధ్యత గుర్తెరిగి పని చేయాల్సిందే. రైతులకు నీళ్లు సకాలంలో ఇస్తే బంగారం పడిస్తారు. మొత్తం రిజర్వాయర్లలో 983 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 692 టీఎంసీలు నిల్వ చేసుకున్నాం. 20 ఏళ్ల తర్వాత ఏపీలో ఆగస్టులోనే రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. వరుణ దేవుడు కూడా మనల్ని ఆశీర్వదిస్తున్నారు. 70శాతం ప్రాజెక్టుల్లో నీళ్లు వచ్చాయి. నీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత " అని చంద్రబాబు అన్నారు."డబ్బులివ్వకపోతే కాంట్రాక్టర్ పని చేస్తారా? గేటు పెట్టలేని ప్రభుత్వం ఐదేళ్లు పాలించింది. ప్రాధాన్యతలు తెలిసిన ప్రభుత్వమిది. కష్టాలున్నా.. ఖాళీ ఖజానా ఉన్నా.. ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత మాది. పాత రోజులు మరిచిపోవాలని అందరికీ చెబుతున్నా. బాధ్యతగా పని చేయాలి. సకాలంలో పనులు పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలో సర్వే రాళ్లపై బొమ్మలకు రూ.700 కోట్లు ఖర్చుపెట్టారు. పేపర్లకు ప్రకటనల కోసం రూ.403 కోట్లు ఖర్చుపెట్టారు. ఈ డబ్బుల్లో రూ.200 కోట్లు ఖర్చు పెట్టినా కొన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవి. రుషికొండ కొట్టేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టించుకున్నారు." అని చంద్రబాబు ధ్వజమెత్తారు.

## ఈనెల 23న గ్రామ సభల నిర్వహణ చేపట్టాలి

**ఉపాధి హామీ పథకం అధికారులతో పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్**



**విశ్వంభర, అమరావతి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. "ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలి. ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాల పనులు చేపట్టవచ్చు. ఈ పథకం ద్వారా వేల కోట్ల నిధులు వెచ్చిస్తున్నాం. ప్రతి రూపాయిని బాధ్యతతో వ్యయం చేయాలి. ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలి. జిల్లా స్థాయి అధికారులు నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారుల వరకు ఈ పథకం అమలులో బాధ్యత తీసుకోవాలి. సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలి" అని పవన్ సూచించారు.

## త్వరలోనే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు



**దిల్లీ:** విశాఖపట్నం కేంద్రంగా త్వరలోనే రైల్వేజోన్ ఏర్పాటు చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. భూ కేటాయింపు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారముందన్నారు. అతిత్వరలోనే జోన్ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన సన్నాహాలకు సిద్ధమవుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూ విషయంలో అభ్యంతరాలు తలెత్తిన నేపథ్యంలో.. ఈ విషయంపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. ఇరు ప్రభుత్వాల అధికారుల మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయని, ఇప్పుడు జోన్ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు త్వరలోనే నెరవేరబోతున్నాయన్నారు.

## దేశవ్యాప్తంగా పసిపిల్లల్ని విక్రయిస్తున్న ముఠాను అరెస్టు

**విశాఖపట్నం:** దేశవ్యాప్తంగా పసిపిల్లల్ని విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు విశాఖ నగర సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఇప్పటి వరకు 17 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ, దిల్లీ, ఇతర రాష్ట్రాలకు ఈ ముఠా విస్తరించినట్లు గుర్తించామన్నారు. ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు చిన్నారులను ప్రత్యేక బృందం రక్షించినట్లు చెప్పారు.



## ఫైబర్ నెట్ అక్రమాల కేసులో కీలక చర్యలు..

**మాజీ ఎండీ మధుసూదన్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేసిన ఏపీ సర్కారు**

**విశ్వంభర, అమరావతి:** ఫైబర్ నెట్ మాజీ ఎండీ మధుసూదన్ రెడ్డిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఆయనపై ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను నియమించినట్లు ఆరోపణలున్నాయి. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జీవో విడుదల చేసింది. ఆయన కేంద్ర సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించారని.. ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ప్రభుత్వం ఆరోపించింది. ఇక మధుసూదన్‌రెడ్డిని హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లొద్దని సదరు జీవోలో స్పష్టం చేసింది. అయితే, ఫైబర్ నెట్‌లో అక్రమాలకు సంబంధించి కేసు విచారణ జరుగుతున్నందున మధుసూదన్ రెడ్డి అందుబాటులో ఉండడం అవసరమని.. ఈ మేరకు ఆయన డిప్యూటేషన్‌ను మరో ఆరు నెలలు పొడిగించాలని ఏపీ సర్కారు రైల్వే బోర్డుకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేసింది. వాస్తవానికి ఏపీలో మధుసూదన్‌రెడ్డి డిప్యూటేషన్ ఈ నెల 22తో ముగియనున్నది. ఆయన 2019 ఆగస్టు 26న రైల్వే అకౌంట్స్ సర్వీస్ నుంచి ఏపీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. ప్రస్తుతం ఫైబర్ నెట్‌లో అక్రమాలపై విచారణ నేపథ్యంలో ఆయనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విచారణ విషయాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లింది. అలాగే, ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకట్‌రెడ్డి డిప్యూటేషన్‌ను పొడిగిస్తూ భారత కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఏపీ సర్కారుకు లేఖ అందింది.వెంకట్‌రెడ్డిపై సైతం అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతున్నది. ఏపీ ప్రభుత్వం రాసిన లేఖ మేరకు ఈ నెల 31 వరకు ఆయన డిప్యూటేషన్‌ను పొడిగించినట్లు సీఎస్‌కు రాసిన లేఖలో కోస్ట్‌గార్డ్ కార్యాలయం తెలిపింది. ఈ విషయంలో కేంద్రానికి సైతం ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. సర్వీస్ నిబంధనల ఉల్లంఘనపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన ఈ నెల 31 పదవీ విరమణ చేయనున్నట్లు తెలిపింది. ఆ తర్వాత చర్యలు ప్రభుత్వమే తీసుకోవాల్సి ఉంటుందని సీఎస్‌కు రాసిన లేఖలో చెప్పింది. గనులశాఖలో అక్రమాలపై వెంకట్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవల సస్పెండ్ చేసిన విషయం విధితమే.




## హాస్టల్ లో విద్యార్థుల మృతి.. రూ.10 లక్షల పరిహారం

విశ్వంభర, అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కోటవురట్ల హాస్టల్లో కలుషితాహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్తో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. బాధిత విద్యార్థుల కుటుంబసభ్యులు లేదా సంరక్షకులకు రూ.10లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.రెండు రోజుల క్రితం అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్టణంలోని హాస్టల్లో సమోసా తిని రెండ్రోజుల క్రితం 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. వీరిలో సోమవారం ముగ్గురు మృతి చెందారు. మిగతా 24 మందికి నర్సీపట్నం, అనకాపల్లి, విశాఖ కేజీహెచ్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.

## అనుమతి లేకుండా నడుస్తున్న అన్ని హాస్టళ్ల పైనా కఠిన చర్యలు తీసుకుంటాం

**విశ్వంభర, విశాఖపట్నం:** అనకాపల్లి జిల్లా కోటవురట్ల హాస్టల్ లో ముగ్గురు మృతి చెందిన ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా దీనిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. హాస్టల్పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కేవలం కోటవురట్ల హాస్టల్ మాత్రమే కాకుండా రాష్ట్రంలో అనుమతి లేకుండా నడుస్తున్న అన్ని హాస్టల్సెపైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సాధారణంగా ప్రభుత్వ అనుమతి ఉన్న హాస్టల్స్ లో బయటి ఆహారపదార్థాలను అనుమతించబోరని- కానీ.. కోటవురట్ల హాస్టల్లో బయటి నుంచి ఎవరో తెచ్చిన ఆహారం తినడం వల్లే చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. కైలాస పట్టణంలోని హాస్టల్లో సమోసాలు తిని 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. వీరిలో సోమవారం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మిగతావారిని నర్సీపట్నం, అనకాపల్లి ఏరియా ఆస్పత్రులతోపాటు, విశాఖపట్నం కేజీహెచ్లో చికిత్స అందిస్తున్నారు.

## బట్టలు ఆరేస్తుండగా.. విద్యుత్ షాక్‌తో దంపతులు మృతి

**విశ్వంభర, కారేపల్లి :** కులాలు వేరైనా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ దంపతులకు ఓ కూతురు జన్మించింది. కూలీ పనులు చేసుకుంటూ సాఫీగా సంసార జీవితం సాగిస్తున్న ఆ దంపతులను విద్యుత్ షాక్ పగబట్టినట్లు కాటేసింది. నిమిషాల వ్యవధిలో ఇద్దరిని బలిగొంది. ఈ విషాదకర ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బస్వాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బస్వాపురం గ్రామానికి చెందిన బానోతు శ్రీను(42), షమీన(40)లు దాదాపు 20 ఏళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. కుమార్తె ప్రియాంక జన్మించింది. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే ఉదయం బట్టలు ఉతికిన షమీన ఇంటి ముందున్న ఇనుప తీగ(దండెం)పై ఆరేస్తుండగా.. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడికక్కడే పడిపోయింది. అదే సమయంలో వారి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి షమీన కిందపడి ఉండటాన్ని గమనించి ఇంట్లో ఉన్న ఆమె భర్త శ్రీనుకు చెప్పాడు.కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షమీన అప్పుడప్పుడు స్పృహతప్పి పడిపోతూ ఉండేది. అలాగే పడిపోయిందనుకున్న శ్రీను తన భార్యను లేపేందుకు యత్నించాడు.



దీంతో అతడికి కూడా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన శ్రీను స్నేహితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ దంపతులను వెంటనే ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాఖీ పౌర్ణమి రోజు భార్యభర్తలిద్దరూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుమార్తె ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

## బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

**దిల్లీ:** దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలోని బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల్లో 44,228 గ్రామీణ డాక్ సేవక్ పోస్టులకు దరఖాస్తు చేసి ఫలితాల కోసం: ఎదురుచూస్తోన్న అభ్యర్థులకు గుడ్న్యూస్. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిని మెరిట్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అధికారులు.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం రాత్రి విడుదల చేశారు. పదో తరగతి అర్హతపై ఎంపిక చేసే ఈ ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్ 1,355 పోస్టులు ఉండగా, తెలంగాణాలో 981 చొప్పున పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టుల కోసం జులై 15 నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. తాజాగా విడుదల చేసిన తొలి జాబితాలో ఏపీ నుంచి 1355 మంది; తెలంగాణ నుంచి 981 మంది షార్ట్ లిస్ట్ అయ్యారు.

ఎంపికైన అభ్యర్థుల జాబితాను https://indiapostgdsonline.gov.in/లో అందుబాటులో ఉంచారు.

కంప్యూటర్ జనరేటెడ్ పద్ధతిలో మార్కుల ప్రాధాన్యం రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి చేపట్టిన ఈ ప్రక్రియలో షార్ట్స్ అయిన అభ్యర్థులు సెప్టెంబర్ 3 లోగా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ గా సేవలు అందించాల్సి ఉంటుంది.

ధ్రువపత్రాల వెరిఫికేషన్కు కావాల్సినవి ఇవే..

* దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన ఆన్లైన్ అప్లికేషన్
* పుట్టిన తేదీ ధ్రువీకరణ సంబంధించి పదో తరగతి మార్కుల మెమో




* 6 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు
* అభ్యర్థి పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు
* ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం
* ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రం
* దివ్యాంగులైతే దివ్యాంగ ధ్రువీకరణ పత్రం
* మెడికల్ సర్టిఫికెట్

## తిరుమలలో వైభవంగా గరుడ సేవ..



**విశ్వంభర, తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి గరుడునిపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవకు అత్యంత ప్రాముఖం ఉన్నది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజేస్తారని.. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని పండితులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. తిరుమల క్షేత్రంలో ఒకే నెలలో రెండుసార్లు గరుడ సేవ జరిగింది. ఈ నెల 9న గరుడ పంచమి సందర్భం మలయప్పస్వామి గరుడ సేవ జరిగింది. ప్రతి ఏడాదీ గరుడ పంచమిని శుక్ల పక్షం ఐదవ రోజున ఘనంగా నిర్వహిస్తారు. గరుడ పంచమి పూజను నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా ఉండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలాగా, బలశాలిగా ఉండేందుకు చేస్తుంటారు. ఇక ప్రతి పౌర్ణమికి తిరుమలలో గరుడ సేవ నిర్వహించే విషయం తెలిసిందే.



## ముడా కుంభకోణం కేసులో సిద్ధరామయ్యకు ఊరట

- ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవద్దు
- ట్రయల్ కోర్టుకు ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు
- నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం
- ఇప్పటివరకు ఎలాంటి తప్పు చేయలేదు
- భవిష్యత్తులోనూ చేయను
- నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీ, జేడీఎస్‌లు కుట్రపన్నాయన్న కర్ణాటక సీఎం

**బెంగళూరు:** కర్ణాటక రాజకీయాల్లో ముడా స్కామ్ కలకలం సృష్టిస్తోన్న తరుణంలో.. హైకోర్టులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఊరట లభించింది. ఆ కుంభకోణానికి సంబంధించి తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సీఎం హైకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కోర్టు స్పందన వచ్చింది. ఆయనపై ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవద్దని ట్రయల్ కోర్టును ఉన్నతన్యాయస్థానం ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణ ఆగస్టు 29న జరగనుంది. అప్పటివరకు వరకు తాత్కాలిక రక్షణ అమల్లో ఉండనుందని తెలిపింది.

సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతమ్మ పేరిట మైసూరు ప్రాంతంలో ఉన్న భూములను గతంలో అభివృద్ధి పనుల కోసం ముడా సేకరించింది. పరిహారంగా ఆమెకు మైసూరు- విజయనగరలో స్థలాలు కేటాయించింది. సీఎం మౌఖిక ఆదేశాలతో ముడా అధికారులు ఆమెకు ఖరీదైన ప్రాంతంలో విలువైన స్థలాలు కట్టబెట్టారని విపక్ష బీజేపీ, జేడీఎస్ ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన విచారణకు అనుమతిస్తూ గవర్నర్ ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని నేడు సిద్ధూ హైకోర్టులో సవాల్ చేశారు.

ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి స్పందించారు. "నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. ఇప్పటివరకు ఎలాంటి తప్పు చేయలేదు. భవిష్యత్తులోనూ చేయను. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీ, జేడీఎస్‌లు కుట్రపన్నాయి. రాజకీయంగా సవాళ్లు ఎదురైనప్పుడు మరింత ఉత్సాహంగా పనిచేస్తా. ఇటువంటివి నిరంతరం ఎదుర్కొంటూనే ఉన్నా" అని కర్ణాటక సీఎం పేర్కొన్నారు.

## ఓబీసీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ

### కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్



**ఢిల్లీ:** లేటరల్ ఎంట్రీ ద్వారా రిజర్వేషన్లకు మోదీ సర్కార్ తూట్లు పొడుస్తున్నదని విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో విపక్ష నేతని, ఆయన రాజ్యాంగ పదవిలో ఉన్నారని, బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం ఆయనకు తగదని ఆక్షేపించారు. లేటరల్ ఎంట్రీ ద్వారా ఆరెస్సెస్ వ్యక్తులను ఉన్నత పదవుల్లో నియమిస్తారని రాహుల్ గాంధీ చెప్పడం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ సైతం లేటరల్ ఎంట్రీలో భాగమేనని గుర్తుచేశారు. 1976లో మీరు ఆయనను నేరుగా ఫైనాన్షియల్ సెక్రటరీగా ఎలా నియమించారని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. మీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ కూడా లేటరల్ ఎంట్రీలో భాగమేనని అన్నారు. ఇలాంటి వందలాది ఉదాహరణలు కనిపిస్తాయని, లేటరల్ ఎంట్రీని తీసుకొచ్చిందే మీరని రాహుల్‌ను ఉద్దేశించి కేంద్ర మంత్రి పేర్కొన్నారు. లేటరల్ ఎంట్రీని మీరు ప్రారంభిస్తే దాన్ని మోదీ క్రమబద్ధీకరణ చేశారని చెప్పారు. 2005లో పరిపాలనా సంస్కరణల కమిషన్ ఏర్పాటైందని, దాని నివేదిక బయటకువచ్చిందని తెలిపారు. 2005 నుంచి యూపీఏ అధికారంలో ఉందని గుర్తుచేశారు. తాము రిజర్వేషన్లకు చరమగీతం పాడతామని చెబుతున్నారని, అసలు మీరు ఎప్పుడు నియామకాలు చేపట్టారని మీరు ఏం చేశారని కేంద్ర మంత్రి నిలదీశారు. కాంగ్రెస్‌కు హఠాత్తుగా ఓబీసీలపై ప్రేమ పెరిగిపోయిందని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ స్వయంగా తాను ఓబీసీ రిజర్వేషన్‌కు వ్యతిరేకమని చెప్పారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓబీసీలపై ప్రేమ పుట్టుకొచ్చిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులను కాంగ్రెస్ తప్పుదారిపట్టిస్తోందని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దుయ్యబట్టారు.

## బంగ్లాదేశ్‌లో మాదిరిగా గవర్నర్ పారిపోయే పరిస్థితి వస్తుంది..

### కాంగ్రెస్ నేత వివాదస్పద వ్యాఖ్యలు



**బెంగళూరు:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై దర్యాప్తునకు ఆదేశించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌ను కాంగ్రెస్ పార్టీ నేత తీవ్రంగా హెచ్చరించారు. దర్యాప్తును వెనక్కి తీసుకోకపోతే బంగ్లాదేశ్‌లో మాదిరిగా గవర్నర్ పారిపోయే పరిస్థితి వస్తుందని అన్నారు. కర్ణాటక గవర్నర్ నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహించారు. సీఎం సిద్ధరామయ్యపై దర్యాప్తునకు ఆదేశించిన గవర్నర్ చర్యను ఖండిస్తూ ఫ్లకార్డులు ప్రదర్శించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కాగా, సోమవారం మంగళూరులో జరిగిన కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు ఇవాన్ డిసౌజా మాట్లాడారు. ఈ సందర్భంగా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'గవర్నర్ తన ఉత్తర్వును ఉపసంహరించుకోకపోతే లేదా ఆయనను ఉపసంహరించుకునేలా రాష్ట్రపతి చేయకపోతే బంగ్లాదేశ్‌లో మాదిరిగా పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ దేశ ప్రధాని పారిపోయినట్లే ఇక్కడ కర్ణాటకలో గవర్నర్ పారిపోతారు. తమ తర్వాత నిరసన గవర్నర్ కార్యాలయం వద్దే' అని అన్నారు.

# నిందితుడికి లై డిటెక్టర్ పరీక్ష

- సీబీఐ పిటిషన్‌ని అనుమతించిన హైకోర్టు
- తదుపరి విచారణ ఆగస్టు 29వ తేదీకి వాయిదా
- కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో కీలక పరిణామం

**కోల్‌కతా:** కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు సంజయ్ రాయ్ "పాలిగ్రాఫ్/లై డిటెక్టర్ టెస్ట్" నిర్వహించాలనే సీబీఐ పిటిషన్ కి కలకత్తా హైకోర్టు అనుమతి ఇచ్చింది. నిందితుడు సంజయ్ రాయ్‌కి మంగళవారం సీబీఐ లై డిటెక్టర్ టెస్టును నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జూనియర్ వైద్యురాలు ఆగస్టు 8వ తేదీ రాత్రి విధుల్లో ఉన్న సమయంలో 31 ఏళ్ల వైద్యురాలిపై దారుణంగా అత్యాచారం, హత్య జరిగింది. నైట్ డ్యూటీలో ఉన్న ఆమె విశ్రాంతి తీసుకునేందుకు సెమినార్ హాలులో ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆగస్టు 9న వెలుగులోకి వచ్చిన ఈ దారుణం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బాధితురాలికి న్యాయం చేయాలని డాక్టర్లు, మహిళలు, సాధారణ ప్రజలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు-.ఈ ఘటనలో సివిక్ వాలంటరీ సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవడంతో కేసును సీబీఐకి అప్పగిస్తూ ఆగస్టు 13న కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఆమెపై సామూహిక అత్యాచారం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. లేదా నిందితుడి వెనుక ఎవరైనా ఉండి ఉంటారనే వార్తలు వినిపించాయి. ఈ కేసులో ప్రభుత్వం, కోల్‌కతా పోలీసుల నిర్లక్ష్యంపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు సీబీఐకి అప్పగించింది.ఈ క్రమంలోనే నిజానిజాలు తెలుసుకునేందుకు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతినివ్వాలని న్యాయస్థానాన్నిసీబీఐ కోరింది. తాజాగా అందుకు అంగీకరించిన కోర్టు.. కేసు తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉంటే ఇప్పటికే నిందితుడు సంజయ్ రాయ్‌కు "సైకలాజికల్ టెస్టు"ని సీబీఐ నిర్వహించింది. నిందితుడి మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు ఈ టెస్టుని నిర్వహించారు. నిన్న ఐదుగురు సీబీఐ వైద్యుల బృందం కోల్కతా చేరుకుని ఈ టెస్టుని నిర్వహించినట్లు తెలుస్తోంది. సైకలాజికల్ టెస్టులో నిందితుడి మానసిక విశ్లేషణ చేసి అంచనా వేయనున్నారు. ఇది అండర్ ట్రయల్స్ వారి అలవాట్లు, దినచర్య, ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి చేస్తారు. ఈ పరీక్షలో, దర్యాప్తు సంస్థ సంజయ్ రాయ్ వాయిస్ని లేయర్డ్ వాయిస్ విశ్లేషణలో ఉంచవచ్చు, అంటే లై-డిటెక్టర్ పరికరం, దాని ద్వారా అతను నిజమే చెబుతున్నాడో లేదో నిర్ధారించుకోవచ్చు.

### బెంగాల్ మహిళలకు సురక్షితమైన ప్రదేశం కాదు: గవర్నర్

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ మహిళలకు సురక్షితమైన ప్రదేశం కాదని గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ అన్నారు. సమాజంలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం ఉండేలా పూర్వ వైభవాన్ని తీసుకురావాలన్నారు. ప్రస్తుతం మహిళలు భయపడుతున్నారని.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఆర్‌జీ ఖర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ఘటనపై ఆయన స్పందించారు. బాధితురాలి తల్లి మనోభావాలను తాను గౌరవిస్తానన్నారు. రక్షా బంధన్ సందర్భంగా రాజ్‌భవన్‌లో మహిళా నేతలు, వైద్యులతో గవర్నర్ సమావేశమయ్యారు. బెంగాల్‌లో ప్రజాస్వామ్యం బలహీనపడుతుందని.. ఇది ఇకపై కొనసాగదన్నారు. మన ఆడబిడ్డలను, సోదరీమణులను కాపాడుకుంటామని ప్రమాణం చేయాలన్నారు. మహిళలు సంతోషంగా, సురక్షితమని భావించే సమాజం ఉండాలన్నారు.ఇదిలా ఉండగా.. బీజేపీ నాయకుడు షాజాద్ పూనావాలా బెంగాల్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం మమతా బెనర్జీ ఎప్పుడు రాజీనామా చేస్తారన్న ప్రశ్న నేడు తలెత్తుతున్నదన్నారు. ఈ విషయంపై ఎవరు గళం విప్పినా మమతా బెనర్జీ ప్రభుత్వం వారికి నోటీసులు పంపి బెదిరించడం చూస్తున్నామన్నారు. పోలీసులు వైద్యులను పిలుస్తున్నారని.. తమ నేతలు సైతం స్వరం పెంచినా వారిని కూడా పిలుస్తున్నారన్నారు. ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ సైతం ఈ ఘటనపై విచారణకు డిమాండ్ చేస్తే.. కోల్‌కతా పోలీసులు జమన్లు జారీ చేశారన్నారు. సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రభుత్వం సంస్థాగత, వ్యవస్థాగత విధానాన్ని అవలంభించిందన్నారు. ఈ విషయంపై బెంగాల్ ప్రభుత్వంపై కోల్‌కతా హైకోర్టు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేసిందని.. సుప్రీంకోర్టు సైతం ఈ విషయంపై దృష్టి సారించిందన్నారు.



## బెంగాల్ హత్యాచార ఘటనలో ఆసుపత్రి మాజీ హెడ్‌పై సీబీఐ ప్రశ్నల వర్షం



**కోల్‌కతా:** బెంగాల్ హత్యాచార ఘటనపై సీబీఐ ముమ్మర దర్యాప్తు చేస్తోంది. ఆ ఘటన జరిగిన సమయంలో వైద్యకళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్న సందీప్ ఘోష్ను కొద్దిరోజులుగా దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారిస్తోంది. ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించింది. వాటిలో కొన్ని ప్రశ్నలు మీడియాలో దర్శనమిచ్చాయి.

* ఆసుపత్రిలో చోటుచేసుకున్న మరణాన్ని తొలుత ఆత్మహత్యగా ప్రకటించాల్సినంత తొందరేమొచ్చింది..? ఎవరి సలహా మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు..? అందులో వాస్తవాలను ఎందుకు ప్రస్తావించలేదు..?

* మీరొక డాక్టర్. నేరం జరిగిన ప్రాంతాన్ని భద్రంగా ఉంచడం ముఖ్యమని మీకు అనిపించలేదా..? క్రైమ్సీన్లో సాక్ష్యాలను తారుమారు చేయడం నేరమని మీకు తెలుసు మరి విచారణ పూర్తయ్యేవరకు ఎందుకు భద్రంగా ఉంచలేదు..?

* మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంలో గంటలపాటు ఆలస్యం ఎందుకు జరిగింది..? వారికి మృతదేహాన్ని చూపించడంలో ఎందుకు ఆలస్యం చేశారు..? ఆసుపత్రిలో ఎలాంటి భద్రతాఏర్పాట్లు ఉన్నాయి..?

* ఘటన జర్గ్గానే మీరు ఎందుకు రాజీనామా చేయలేదు..? అందుకుగల కారణం ఏంటి..? ఘటన గురించి తెలియగానే ఎలాంటి చర్యలు చేపట్టారు..? మృతదేహం దొరికిన సెమినార్ హాల్ పక్కన ఉన్న గదులకు అప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది..?గత మూడురోజులుగా అర్ధరాత్రి వరకు అడిగిన ప్రశ్నలివి. వాటికి ఆయన సరైన సమాధానాలు చెప్పలేదని తెలుస్తోంది. అలాగే సీబీఐ ఆయన కాల్ రికార్డులను పరిశీలిస్తోంది. ఘటనకు ముందు తర్వాత ఎవరెవరితో మాట్లాడారో ఆరాతీస్తోంది. ఈ రోజు కూడా ఆయన్ను విచారణకు పిలిచింది.కోల్కతాలోని ఆర్జే కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పెను సంచలనం రేపుతోంది. అది జరిగిన రెండు రోజుల తర్వాత కాలేజీ ప్రిన్సిపల్ ఉన్న డాక్టర్ సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. "నన్ను పదవి నుంచి దింపేలా విద్యార్థులను కొంతమంది రెచ్చగొట్టారు. నిందితుడికి శిక్ష పడాలనే కోరుకున్నా. బాధితురాలికి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. కావాలనే నా పరువు తీస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో నాపై జరుగుతున్న ఈ అవమానాన్ని భరించలేకపోతున్నా. మృతి చెందిన అమ్మాయి నా కుమార్తెలాంటిదే. నేను కూడా ఓ తండ్రినే. అందుకే రాజీనామా చేస్తున్నా. భవిష్యత్తులో ఎవరికీ ఇలాంటి దారుణ ఘటన జరగకూడదు" అంటూ రాజీనామా సమర్పించారు.ఆ తర్వాత కొద్ది గంటల వ్యవధిలోనే కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్కు ప్రిన్సిపల్గా నియమితులయ్యారు. ఈ నియామకం వివాదాస్పదం కావడంతో కలకత్తా హైకోర్టు స్పందించింది. సందీప్ ఘోష్ సుదీర్ఘ సెలవులో ఉండాలని ఆదేశించింది. "ఆసుపత్రిలో పనిచేస్తోన్న వైద్యులకు ప్రిన్సిపలే గార్డియన్. ఆయనే ఎలాంటి జాలి చూపించకపోతే ఇంకెవరు చూపిస్తారు. ఆయన ఎక్కడా పనిచేయకుండా ఇంట్లోనే ఉండాలి" అని పేర్కొంది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సంగతి తెలిసిందే.



## సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

**ఢిల్లీ:** ఇస్లాం మతంలోని ట్రిపుల్ తలాక్ ఆచారం ముస్లిం మహిళల పరిస్థితిని దయనీయంగా మార్చిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ ఆచారం వివాహమనే సామాజిక సంప్రదాయానికి ప్రమాదకరంగా మారిందని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వివరించింది.సుప్రీంకోర్టు 2017లో ఈ ఆచారాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని, అయినా కొంతమంది ముస్లింలలో ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతోందని అఫిడవిట్ ద్వారా కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అందువల్ల ముస్లింలలో ట్రిపుల్ తలాక్ విడాకుల సంఖ్యను తగ్గించడంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రతిబంధకంగా పనిచేయలేదని తెలిపింది.

ట్రిపుల్ తలాక్ బాధితులు పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకపోవడం, చట్టంలో శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో బాధితుల భర్తలపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని, దాంతో పోలీసులు నిస్సహాయంగా మారారని పేర్కొంది. ట్రిపుల్ తలాక్ విడాకులను నిరోధించేందుకు కఠినమైన నిబంధనల అవసరం ఉందని వాదించింది.కాగా, ట్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయలేదని, కాబట్టి ట్రిపుల్ తలాక్ విడాకులను నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దాంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.

## పెట్రోలింగ్ సిబ్బందిపై ఉగ్రదాడి..

### సీఆర్పీఎఫ్ అధికారి మృతి

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పారామిలిటరీ సిబ్బందిపై ఉగ్ర దాడి జరిగింది. ఈ సంఘటనలో సీఆర్పీఎఫ్ అధికారికి బుల్లెట్ గాయమైంది. ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ఉధంపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగినట్లు చెప్పారు. జమ్ముకశ్మీర్ పోలీసు బలగాలు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ) సంయుక్త పార్టీపై ఉగ్రవాదులు దాడి చేశారు. సోమవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో బసంత్‌గఢ్‌లోని మారుమూల ప్రాంతంలోని దూడు ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్)పై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.కాగా, సీఆర్పీఎఫ్ 187వ బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ కుల్‌దీప్ సింగ్‌కు బుల్లెట్ తగిలి గాయమైందని ఆర్మీ అధికారులు తెలిపారు. ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు చెప్పారు. ఆ ప్రాంతానికి వెంటనే అదనపు బలగాలను రప్పించినట్లు వివరించారు. పారిపోయిన ఉగ్రవాదులను గుర్తించి మట్టుబెట్టేందుకు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు.





## ఆర్టికల్ 370 పునరుద్ధరణ

### జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టో విడుదల

**శ్రీనగర్:** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కీలక హామీలతో నేషనల్ కాన్ఫరెన్స్ తన ఎన్నికల మేనిఫెస్టోను సోమవారం విడుదల చేసింది. మేనిఫెస్టోలో 12 గ్యారంటీలకు చోటు కల్పించింది. ఆర్టికల్ 370 పునరుద్ధరణ, 35-ఏ, రాష్ట్ర హోదా వంటి భారీ హామీలను గుప్పించింది. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు.కశ్మీరీ పండిట్లను తిరిగి రప్పించి వారికి పునరావాసం కల్పిస్తామని పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతంలో రాజకీయ, చట్టబద్ధ స్థితిని పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో తొలి గ్యారంటీగా పేర్కొంది. ఆర్టికల్ 370, 35ఏ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది. రాజకీయ ఖైదీల విడుదల, కశ్మీరీ పండిట్ల పునరావాసం, జాబ్ వెరిఫికేషన్ ప్రక్రియ సులభతరం, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ సరళీకరణ సహా పలు హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచింది. యువతకు సమగ్ర ఉపాధి ప్యాకేజ్ ప్రకటిస్తామని మూడో గ్యారంటీగా పేర్కొంది. ఇక 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని ఒమర్ అబ్దుల్లా హామీ ఇచ్చారు. మంచినీటి సరఫరా, విద్యుత్ పంపిణీలో సమస్యలను అధిగమిస్తామని తెలిపింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని నేషనల్ కాన్ఫరెన్స్ హామీ ఇచ్చింది.

## తన పాదాలకు మసాజ్ చేయలేదని.. తండ్రిని చంపిన కొడుకు

**ముంబై:** సాధారణంగా వృద్ధులైన తల్లిదండ్రులకు కుమారులు సేవలు చేయాల్సి ఉంటుంది. అయితే ఒక కుమారుడు దీనికి వ్యతిరేకంగా వ్యవహరించాడు. తన పాదాలకు మసాజ్ చేయమని తండ్రిని బలవంతం చేశాడు. వృద్ధుడైన ఆ తండ్రి నిరాకరించడంతో కొట్టి చంపాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. నవాబ్‌పురా ప్రాంతంలో నివసించే 62 ఏళ్ల దత్తాత్రేయ షెండేకు ఇద్దరు కుమారులు. గతంలో నేర చరిత్ర ఉన్న 33 ఏళ్ల చిన్న కుమారుడు కుశాల్ అలియాస్ ఇంగా షెండే శనివారం సాయంత్రం తన పాదాలకు మసాజ్ చేయమని తండ్రితో అన్నాడు. వృద్ధుడైన తండ్రి దీనికి నిరాకరించడంతో అతడు ఆగ్రహించాడు. తండ్రి ఛాతి, కడుపు, పక్కటెముకలు, తలపై కొట్టాడు.కాగా, పెద్ద కుమారుడు ప్రణవ్ జోక్యం చేసుకుని తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. తమ్ముడు బెదిరించడంతో సహాయం కోసం పొరుగువారి ఇంటికి వెళ్లాడు. ప్రణవ్ తిరిగి వచ్చేసరికి వృద్ధుడైన తండ్రి గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆయనను ఆసుపత్రికి తరలించగా మరణించినట్లు డాక్టర్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు తండ్రిని చంపిన చిన్న కుమారుడు కుశాల్‌ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మలయాళ సినీ పరిశ్రమలో మహిళలపై వేధింపులు

### జస్టిస్ హేమ కమిటీ నివేదిక

**తిరువనంతపురం:** మలయాళం సినిమా పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ నివేదిక సంచలన విషయాలను వెల్లడించింది. ఇండస్ట్రీలో మహిళా ప్రొఫెషనల్స్ లైంగిక వేధింపులు, దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నది. అమానవీయ ప్రవర్తనకు బాధితులుగా ఉన్నారని తెలిపింది.ఇండస్ట్రీని కొంత మందితో కూడిన ఒక 'క్రిమినల్ గ్యాంగ్' నియంత్రిస్తున్నదని పేర్కొన్న కమిటీ.. లొంగని మహిళలను ఇండస్ట్రీ నుంచి బయటకు పంపేస్తారని వెల్లడించింది. కొంత మంది ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, నటులు, ప్రొడక్షన్ కంట్రోలర్స్ మధ్య ఒప్పందం ఉన్నదని కమిటీ నివేదిక ఆరోపించింది. 2017లో ఓ నటిపై దాడి కేసు తర్వాత ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

## రష్యాలో కేరళ యువకుడి మృతి

### బలవంతంగా ఆ దేశ మిలటరీలో ఉద్యోగం



**తిరువనంతపురం:** ఉక్రెయిన్ సైనిక బలగాలు జరిపిన దాడుల్లో కేరళ యువకుడు రష్యాలో మరణించాడు. రష్యా మిలటరీ తరఫున పనిచేస్తున్న త్రిస్సూర్‌కు చెందిన సందీప్ (36), ఉక్రెయిన్ యుద్ధంలో మరణించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విదేశాల్లోని మలయాళీ సంఘాల నుంచి సందీప్ కుటుంబానికి ఈ మేరకు సమాచారం అందింది.రెస్టారెంట్‌లో ఉద్యోగం లభించిందని సందీప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో మాస్కోకు చేరుకోగా, బలవంతంగా అతడ్ని ఆ దేశ మిలటరీలో చేర్చారని స్థానికులు చెబుతున్నారు. రష్యాలో ఉద్యోగాలంటూ ఏజెంట్లు చేస్తున్న మోసాలకు కేరళ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన యువకులు బలవుతున్నారు.

## సీతారాం ఏచూరికి అస్వస్థత



**న్యూఢిల్లీ:** సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయన్ని సోమవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్చారు. ఏచూరి గత కొంతకాలంగా నిమోనియాతో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఆయన్ని దవాఖానలోని అత్యవసర విభాగంలో చేర్చామని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి.వైద్య పరీక్షల నిమిత్తం ఎయిమ్స్‌కు వచ్చిన ఏచూరి, నిమోనియా తగ్గకపోవటంతో దవాఖానలో చేరారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందన్నారు. కొద్ది రోజుల క్రితమే ఏచూరి కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్నారు.

## ఆర్మీ మాజీ చీఫ్ పద్మనాభన్ కన్నుమూత



**చెన్నై:** భారత సైన్యం మాజీ చీఫ్ జనరల్ సుందరరాజన్ పద్మనాభన్ (83) సోమవారం కన్నుమూశారు. వృద్ధాప్య కారణాల వల్ల ఆయన తుది శ్వాస విడిచినట్లు సమాచారం. ఆయన 2000 సెప్టెంబరు 30 నుంచి 2002 డిసెంబరు 31 వరకు ఆర్మీ చీఫ్‌గా పని చేశారు. 15 కోర్ కమాండర్‌గా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అతి విశిష్ట్ సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రదానం చేసింది.

## ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

### మంచు లింగాన్ని దర్శించుకున్న 5 లక్షల మంది భక్తులు

**న్యూఢిల్లీ:** అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య గత 52 రోజులుగా సాగిన అమర్‌నాథ్ యాత్ర సోమవారం శ్రావణ పూర్ణిమతో ముగిసింది. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, ఉగ్రదాడుల్ని సైతం లెక్కచేయకుండా అయిదు లక్షల మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకున్నారు. ఈ ఏడాది జూన్ 29న యాత్ర మొదలైంది. రెండు మాసాలు మాత్రమే దర్శనమిచ్చే మంచు లింగాన్ని సాక్షాత్తు కైలాస నాథుడు పరమేశ్వరుడిగా భక్తులు భావిస్తారు.



# రుణమాఫీపై చిత్తశుద్ధి ఉంటే శ్వేత పత్రం విడుదల చేయాలి

### బండి సంజయ్

**విశ్వంభర, కరీంనగర్ :** రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని తన నివాసం వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతన లేదని, సోనియాగాంధీ పుట్టిన రోజు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొందరికే మాఫీ చేశారని ఆరోపించారు.రూ.40వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి సోనియా గాంధీనే మోసం చేసిన ఘనులు కాంగ్రెస్ నాయకులని విమర్శించారు. రైతు భరోసా, విద్యా భరోసా, మహాలక్ష్మి వంటి ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రజల గురించి పట్టించుకో వడం మానేసిందని, పాలనను గాలికి వదిలేసిందన్నారు. అడిగితే తప్ప స్పందించడం లేదని, కరీంనగర్ జిల్లాలో సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా వెంటనే రివ్యూ పెట్టి సమస్యను పరిష్కరించాలన్నారు.



## అభిమానాన్ని చాటుకున్న చిన్నారి.. కేటీఆర్‌కు రాఖీ కట్టిన కృతిక



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతిక అనే నాలుగేండ్ల చిన్నారి రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటింది. జనవరిలో వీధి కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన కృతికకు కేటీఆర్ వైద్యం చేయించి, ఆ పాపను ప్రాణాలతో కాపాడారు. దీంతో తన ప్రాణాలను కాపాడిన కేటీఆర్ పట్ల కృతిక గొప్ప మనసు చాటుకుంది. రాఖీ పండుగ సందర్భంగా తన తల్లితో కలిసి కేటీఆర్‌కు రాఖీ కట్టి అభిమానాన్ని చాటింది కృతిక.రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న కృతిక(4)పై వీధి కుక్క దాడి చేసిన సంగతి తెలిసిందే. వీధి కుక్క చిన్నారి మొహం, చెవి కొరికింది. కుక్క దాడిలో చిన్నారి చెవి సగం తెగిపోయింది. గాయాలపాలైన చిన్నారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై కేటీఆర్ తక్షణమే స్పందించి కృతికకు కావాల్సిన వైద్యం చేయించారు.

## రుణమాఫీ కాలేదని నిరసనకు దిగిన రైతులను అరెస్టు చేస్తారా? :హరీశ్ రావు

**విశ్వంభర, హైదరాబాద్:** రుణమాఫీ కాలేదని నిరసనకు దిగిన రైతులను అరెస్టు చేస్తారా? అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతుల అరెస్టు హేయమైన చర్య అని విమర్శించారు. ప్రజాపాలన అంటూ అప్రజాస్వామిక విధానాలు పాటిస్తారా అని నిలదీశారు."శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేస్తున్నారు. రైతులు రుణమాఫీ కాలేదని కలెక్టరేట్లు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. రైతు బంధు రాక.. రుణమాఫీ కాక.. అన్నదాత ఆవేదనలో ఉన్నాడు. వాళ్లు పొలం పనులు చూసుకోవాలా.. రుణమాఫీ కోసం తిరగాలా? అరెస్టయిన రైతులకు మా పార్టీ అండగా నిలుస్తుంది" అని హరీశ్రరావు తెలిపారు.



## మాజీ జూనియర్ ఆర్టిస్ట్ అనురాధ దారుణ హత్య..

### పరారీలో భర్త శివరామయ్య

**విశ్వంభర, హైదరాబాద్:** అనుమానం పెనుభూతమైంది. అనుమాతనంతో కట్టుకున్న భార్యను కడతేర్చాడో దుర్మార్గుడు. జూనియర్ ఆర్టిస్టుగా పనిచేసిన మహిళను ఆమె భర్త గొంతు నులిమి హత్య చేశాడు . రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలనీకి చెందిన మద్దూరి అనురాధ (36) హత్యకు గురైనట్లు పట్టణ సీఐ విజయ్ కుమార్ మీడియాకు తెలిపారు. మల్లికార్జున కాలనీలో నివాసం ఉంటున్న మద్దూరి అనురాధ, శివరామయ్య దంపతులు తరచుగా గొడవపడేవారని వివరించారు. చిత్ర పరిశ్రమలో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేసిన అనురాధను భర్త శివరామయ్య నిత్యం అనుమానించే వాడన్నారు.సోమవారం ఉదయం 9 గంటల సమయంలో అనురాధ కూతురు నందినికి తండ్రి ఫోన్ చేసి అనురాధ ఆత్మహత్య చేసుకుందని సమాచారమిచ్చి పరారయ్యాడు. బంధువులు అనుమానంతో అనురాధ మృతదేహాన్ని పరిశీలించగా గొంతు నులిమి చంపిన ఆనవాళ్లు కనిపించాయని పేర్కొన్నారు. తన తల్లిని తండ్రి శివరామయ్య హత్య చేసినట్టు కూతురు నందిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావుకు మధ్యంతర బెయిల్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణలతో నాంపల్లి కోర్టు 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. గుండె సంబంధిత చికిత్స కోసం బెయిల్ ఇవ్వాలని భుజంగరావు అప్పీల్చేయగా.. కోర్టు తాజా ఉత్తర్వులు ఇచ్చింది.

## 13 మంది బాలికలపై లైంగిక వేధింపులు

### ఎన్‌సీసీ క్యాంప్ పేరుతో అకృత్యం

### తమిళనాడులో ఆలస్యంగా వెలుగులోకి

**చెన్నై:** తమిళనాడులో కృష్ణగిరి జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేస్తామని నమ్మబలికిన నిందితులు.. ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు మరో 12 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ నెల మొదటి వారంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పాఠశాల ప్రిన్సిపాల్, ఇద్దరు టీచర్లతో సహా 11 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. ఎన్‌సీసీ క్యాంపు సందర్భంగా బాలికలకు స్కూల్ ఆడిటోరియంలో, బాలురుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో వసతి ఏర్పాటు చేశారు.పిల్లలను పర్యవేక్షించేందుకు ఒక్క టీచర్‌ను కూడా నియమించలేదు. దీన్ని అదనుగా తీసుకొన్న నిందితులు ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు మరో 12 మందిపై వేధింపులకు పాల్పడ్డారు. నిందితులపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తమపై లైంగిక వేధింపులు జరిగిన విషయాన్ని బాధిత బాలికలు స్కూల్ యాజమాన్యానికి తెలిపారని, అయితే వారు పోలీసులకు సమాచారం అందించకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని కృష్ణగిరి జిల్లా ఎస్పీ పీ తంగదురై తెలిపారు.

## బాలికను నిర్బంధించి.. 5 రోజులు గ్యాంగ్ రేప్

**న్యూఢిల్లీ:** అరుణాచల్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకున్నది. 13 ఏండ్ల బాలికను ఐదు రోజులపాటు నిర్బంధించి ఐదుగురు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అప్పర్ సుబన్‌సిరి జిల్లా డపోరిజో పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసు సూపరింటెండెంట్ థూటన్ జంబ ఆదివారం మాట్లాడుతూ, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కోర్టు వీరికి జ్యుడిషియల్ కస్టడీ విధించిందన్నారు. వీరంతా 20-30 ఏళ్ల మధ్య వయస్కులని చెప్పారు.

## యూపీలో దళిత నర్సుపై రేప్

**మొరాదాబాద్:** యూపీలోని మొరాదాబాద్‌లో ఓ దళిత నర్సుపై(20) ఆమె పనిచేస్తున్న ప్రైవేట్ దవాఖాన వైద్యుడు లైంగిక దాడి చేశాడని పోలీసులు వెల్లడించారు. బాధితురాలు ఆదివారం విధులకు వెళ్లారు. అర్ధరాత్రి మెహనాజ్ అనే నర్సు బలవంతంగా ఆమెను దవాఖానలోని మొదటి అంతస్తులోని ఒక గదిలోకి తీసుకెళ్లి తాళం వేశారు. అనంతరం షానవాజ్ ఆ గదిలోకి వెళ్లి నర్సును రేప్ చేశాడు. కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించాడు.

## సోదరుడికి రాఖీ కట్టేందుకు పుట్టింటికి వెళ్తానన్న భార్య.. ముక్కు కోసిన భర్త

**లక్నో:** సోదరుడికి రాఖీ కట్టేందుకు పుట్టింటికి వెళ్తానని భార్య పట్టుబట్టింది. ఆగ్రహించిన భర్త ఆమె ముక్కు కోశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బనియాని పూర్వాలో నివసిస్తున్న రాహుల్, 25 ఏళ్ల అనిత భార్యాభర్తలు. వారిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో పుట్టింటికి వెళ్లిన అనిత నాలుగు రోజుల కిందట భర్త ఇంటికి వచ్చింది. అయితే సోదరుడికి రాఖీ కట్టేందుకు తన పుట్టింటికి వెళ్తానని భర్త రాహుల్‌కు ఆదివారం చెప్పింది. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన అతడు అనిత ముక్కు కోశాడు.కాగా, మహిళ కేకలు విన్న ఆమె బావ వెంటనే అక్కడకు చేరుకున్నాడు. ముక్కు తెగడంతో రక్తపు మడుగులో పడి ఉన్న అనితను హర్దోయ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు. మెరుగైన చికిత్స కోసం లక్నోలోని ట్రామా సెంటర్‌కు డాక్టర్లు రిఫర్ చేయడంతో ఆమెను అక్కడకు తరలించారు.మరోవైపు ముక్కు కోసిన భర్త రాహుల్‌పై అనిత ఆగ్రహం వ్యక్తం చేసింది. తన కష్టాలను వెల్లబోసుకుంది. ఇక బతకడం ఇష్టం లేదని చెప్పింది. తన భర్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆ మహిళ మాట్లాడిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది : పాట్ కమిన్స్

**విశ్వంభర, క్రీడావిభాగం :** ఒలింపిక్స్‌లో ఆడాలని ఉందని ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. వచ్చే ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు కల్పిస్తూ ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసీస్ తరఫున ఒలింపిక్స్‌లో ఆడాలనే కోరిక ఉందని కమిన్స్ తెలిపాడు. 'ఒలింపిక్స్ గేమ్స్‌ను చూసినప్పుడు చాలా ఉత్సాహంగా ఉంటుంది. అందులో భాగం కావాలని ఉంది. వచ్చే ఒలింపిక్స్ కల్లా నాకు 35 ఏళ్లు వస్తాయి. ఆసీస్ తరఫున ఆడతాననే అనుకుంటున్నా. లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ దగ్గరపడినప్పుడు సన్నాహాలు ప్రారంభిస్తాం. ఆ సమయానికి ఫిట్‌గా, ఫామ్‌లో ఉండే వారికి అవకాశం దొరుకుతుంది. కాబట్టి ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తా' అని కమిన్స్ అన్నాడు.





## రంజీ మ్యాచ్‌తో షమీ రీఎంట్రీ

**విశ్వంభర, క్రీడావిభాగం:** చీలమండ గాయం, శస్త్రచికిత్స నేపథ్యంలో వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ జరిగినప్పటి నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ రీఎంట్రీకి సిద్ధమవుతున్నాడు. వాస్తవానికి దులీప్ ట్రోఫీలోనే అతడు ఆడతాడని అంతా భావించారు. కానీ గాయం ఇంకా మానకపోవడంతో అతడి రీఎంట్రీ ఆలస్యం అవుతోంది. ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో కోలుకుంటున్న షమీ.. నవంబర్‌లో ప్రారంభం కానున్న ఆస్ట్రేలియా సిరీస్ నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాడు. ఇందులో భాగంగా మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు అతడి రంజీ ట్రోఫీలో ఆడాలని నిర్ణయించుకున్నాడు. రంజీలో బెంగాల్ తరఫున ఆడే షమీ.. ఆ జట్టు ఆడే తొలి రెండు మ్యాచుల్లో పాల్గొనే అవకాశం ఉంది. అక్టోబర్ 11న యూపీతో, అక్టోబర్ 18న బిహార్‌తో బెంగాల్ తలపడనుంది. ఈ రెండు మ్యాచుల మధ్య తక్కువ గ్యాప్ ఉండటంతో.. కనీసం ఒక్క మ్యాచులో అయినా ఆడాలని షమీ భావిస్తున్నాడు. ఇందులో మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకుని.. స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌తో జాతీయ జట్టు తరఫున రీఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నాడు. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ అక్టోబర్ 19న ప్రారంభం కానుంది. రెండో టెస్టు అక్టోబర్ 24న, మూడో టెస్టు నవంబర్ 1న జరగనుంది. ఈ మూడు మ్యాచుల్లో కనీసం ఒక్కదాంట్లో అయినా షమీ ఆడే అవకాశం ఉంది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ నాటికి పూర్తి ఫిట్‌గా ఉండాలని అతడు భావిస్తున్నాడు. అందుకు అనుగుణంగా సిద్ధం అవుతున్నాడు. అయితే న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందే భారత్.. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ ఆడనుంది. కానీ బోర్డర్ గావస్కర్ ట్రోఫీని వరుసగా ఐదోసారి కైవసం చేసుకోవాలంటే.. షమీ లాంటి పేసర్ జట్టులో ఉండటం అవసరం. ఈ నేపథ్యంలో దానికి తగ్గట్టుగానే బీసీసీఐ కూడా అతి విషయంలో ఆచీతూచీ వ్యవహరిస్తోంది. నవంబర్ 22నుంచి భారత్-ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. కాగా 34 ఏళ్ల మహమ్మద్ షమీ.. చివరగా భారత్ తరఫు వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత చీలమండ గాయం, దానికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం బౌలంగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (2023-2025) ఫైనల్ చేరాలంటే.. భారత్‌కు ఆస్ట్రేలియా సిరీస్ కీలకం. ఇందులో గెలిస్తేనే వరుసగా మూడోసారి భారత్.. ఫైనల్ చేరుతుంది. దీంతో అప్పటివరకు భారత పేస్ త్రయం జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, మహమ్మద్ షమీలు ఫిట్‌గా ఉండాలని భారత యాజమాన్యం భావిస్తోంది. షమీ ఇప్పటివరకు భారత తరఫున 64 టెస్టు మ్యాచులు ఆడాడు. అందులో 229 వికెట్లు పడగొట్టాడు.

## టేప్ చుట్టిన బంతితో ప్రాక్టీస్ చేసేవాళ్లం



### రివర్స్ స్వింగ్ టెక్నిక్‌పై సచిన్

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ సందర్భాన్ని బట్టి ఇండియన్ క్రికెట్ కు కొన్ని సలహాలు, సూచనలు ఇస్తుంటాడు. మెరుగైన ఆటగాళ్లను దేశానికి అందించడానికి, వారిని స్టార్ క్రికెటర్లుగా తీర్చిదిద్దడానికి అవి ఉపయోగపడుతుంటాయి. 2025 జనవరిలో జరగబోయే ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్‌లో ఓ పద్ధతిని అవలంభించి, బ్యాటర్లను పరీక్షించాలని చెప్పుకొచ్చాడు. బ్యాటర్లకు ప్రయోజనం కల్పిస్తున్నప్పుడు బౌలర్లకు కూడా ఆ అవకాశం ఇవ్వాలని పేర్కొన్నాడు. ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్.. 2025 జనవరి 26 నుంచి ఫిబ్రవరి 9 వరకు రెండో సీజన్ జరగనుంది. ఈ సీజన్ లో టేపు చుట్టిన టెన్నిస్ బంతితో రివర్స్ స్వింగ్ చేయడం ద్వారా బ్యాటర్లను టెస్ట్ చేయాలని సచిన్ సూచించాడు. సచిన్ మాట్లాడుతూ.."నేను క్రికెట్ ఆడే తొలి రోజుల్లో టెన్నిస్ బంతికి ఒకవైపు టేపు చుట్టేవాడిని, ఎందుకంటే? దానికి ఒకవైపు మెరుపు.. మరోవైపు గరుకుగా ఉంటుంది. కాబట్టి టెన్నిస్ బాల్ కు టేపు చుట్టి ప్రాక్టీస్ చేసేవాళ్లం. ఈ పద్ధతిని ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ లో ఎందుకు ప్రవేశపెట్టకూడదు? బ్యాటర్లకు ప్రయోజనం కల్పిస్తున్నప్పుడు, బౌలర్లకు సైతం అవకాశం ఇవ్వాలి. ఈ విధానాన్ని అమలు చేసి.. బ్యాటర్ల సత్తాను పరీక్షించవచ్చు" అని టీమిండియా దిగ్గజం పేర్కొన్నాడు. మరి సచిన్ సూచనలపై మీ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేయండి.

## ప్రపంచకప్‌పై పెరుగుతోన్న నిరసనలు

### ఆడబోమన్న ఆసీస్ కెప్టెన్

**విశ్వంభర, క్రీడావిభాగం :** బంగ్లాదేశ్‌లో మహిళల T20 ప్రపంచ కప్ ఆడటం సరికాదని అలిస్సా హీలీ అభిప్రాయపడింది. T20 ప్రపంచ కప్‌నకు ఆతిథ్యం ఇవ్వడం బంగ్లాదేశ్‌పై మరింత ఒత్తిడిని కలిగిస్తుందని అలిస్సా హీలీ అభిప్రాయపడింది. ఐసీసీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, ఈ వారంలో నిర్ణయం తీసుకోవచ్చని అలిస్సా హీలీ క్రికెట్ ఆస్ట్రేలియాతో అన్నారు. 2024లో మహిళల టీ20 ప్రపంచకప్ బంగ్లాదేశ్‌లో జరగనుంది. కానీ బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల కారణంగా దేశంలో హింస చెలరేగుతోంది. దీంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. తద్వారా మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, టోర్నీని సజావుగా నిర్వహించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బంగ్లాదేశ్ ఆర్మీ సాయం కోరింది. అయితే, ఈలోగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఆపరేషన్స్ ప్రెసిడెంట్ జలాల్ యూనస్ కూడా తక్షణమే తన పదవికి రాజీనామా చేశారు. వీటన్నింటి మధ్య, ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ బంగ్లాదేశ్‌లో T20 ప్రపంచ కప్ ఆడటం గురించి కీలక ప్రకటన చేసింది. బంగ్లాదేశ్‌లో మహిళల టీ20 ప్రపంచకప్ ఆడడం సరికాదని అలిస్సా హీలీ అభిప్రాయపడింది. T20 ప్రపంచ కప్‌నకు ఆతిథ్యం ఇవ్వడం బంగ్లాదేశ్‌పై మరింత ఒత్తిడిని కలిగిస్తుందని అలిస్సా హీలీ అభిప్రాయపడింది. ఇది ఇప్పటికీ వందల మందిని చంపిన సామూహిక హింస, నిరసనల నుంచి కోలుకుంటుంది. ప్రస్తుతం అక్కడ ఆడడం గురించి ఆలోచించడం నాకు కష్టంగా ఉంది. మనిషిగా అలా




చేయడం తప్పు అని నేను భావిస్తున్నాను. ఇది తీవ్ర సంక్షోభంలో ఉన్న దేశం నుంచి వనరులను తీసివేస్తుంది. మరణిస్తున్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి. ఐసీసీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, ఈ వారంలో నిర్ణయం తీసుకోవచ్చని అలిస్సా హీలీ క్రికెట్ ఆస్ట్రేలియాతో అన్నారు. మహిళల T20 ప్రపంచ కప్ బంగ్లాదేశ్‌లో అక్టోబర్ 3 నుంచి 19 వరకు జరగనుంది. ఇందులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో సహా 10 జట్లు పాల్గొంటాయి. ఇందులో భారత మహిళల క్రికెట్ జట్టు కూడా ఉంది. అయితే, ఈ టోర్నీ నిర్వహణపై ఐసీసీ మంగళవారం (ఆగస్టు 20) తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే, టోర్నీకి ఆతిథ్యం ఇవ్వాలని బంగ్లాదేశ్ భావిస్తోంది. మరోవైపు ఆతిథ్య రేసు నుంచి భారత్ వైదొలగడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో టోర్నీని నిర్వహించే అవకాశాలున్నాయి.

## మరోసారి అదరగొట్టిన సమిత్ ద్రవిడ్

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా దిగ్గజ మాజీ క్రికెటర్, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్ మరోసారి తన సత్తా చూపించాడు. కర్ణాటక వేదికగా జరుగుతున్న మహారాజా ట్రోఫీ కేఎస్‌సీఏ టీ20 2024 టోర్నీలో మైసూర్ వారియర్స్ తరఫున ఆడుతున్న సమిత్.. గత రెండు మ్యాచ్‌ల కంటే చాలా మెరుగ్గా రాణించాడు. తొలి మ్యాచ్‌లో 7 పరుగులే చేసి నిరాశపర్చిన సమిత్.. రెండో మ్యాచ్‌లో ఒక అగ్రెసివ్ షాట్‌తో సిక్స్ కొట్టి.. అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇక ఆదివారం గుల్బర్గా మైస్టిస్‌తో జరిగిన మ్యాచ్‌లో.. ఒక మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు సమిత్. ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సమి.. నాలుగో ఓవర్‌లోనే క్రీజ్‌లోకి రావాల్సి వచ్చింది. ఓపెనర్లు ఎస్‌యూ కార్తీక్, కార్తీక్ సీఏ వెంటవెంటనే అవుట్ కావడంతో.. మైసూర్ వారియర్స్ జట్టు కేవలం 18 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ కరుణ్ నాయర్‌తో కలిసి.. సమిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నాడు. ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంతో పాటు.. మంచి స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ.. అదరగొట్టాడు. కేవలం 24 బంతుల్లోనే 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో 33 పరుగులు చేసి... కెప్టెన్ కరుణ్ నాయర్‌తో కలిసి మూడో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మైసూర్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ కరుణ్ నాయర్ 35 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 66 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సుచిత్ 40, సమిత్ 33 పరుగులు చేసి రాణించారు. ఇక 197 పరుగుల టార్గెట్‌ను ఛేజ్ చేసేందుకు బరిలోకి దిగిన గుల్బర్గా సరిగ్గా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 200 రన్స్ చేసి గెలిచింది. సమరన్ 60 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సులతో 104 పరుగులు చేసి అదరగొట్టాడు. ప్రవీణ్ దూబే సైతం 37 రన్స్‌తో రాణించాడు. ఇక ఈ మ్యాచ్‌లో మైసూర్ ఓడినా.. మంచి ప్రదర్శన కనబర్చిన సమిత్ ద్రవిడ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. తండ్రి ద్రవిడ్‌కు పూర్తి అపొజిట్‌గా అగ్రెసివ్ బ్యాటింగ్‌తో సమిత్ అదరగొడతున్నాడంటూ క్రికెట్ ఫ్యాన్స్ అంటున్నారు.



## విరాట్‌ది పరుగుల ఆకలి




### రోహిత్ శర్మ

**విశ్వంభర, క్రీడావిభాగం :** ప్రస్తుతం టీమ్ఇండియాలో కీలక ఆటగాళ్లలో విరాట్ కోహ్లి ఒకడు. ప్రస్తుతమే కాదు గత 16 ఏళ్లుగా కీలక ప్లేయర్స్ జాబితాలో అతనిదే మొదటి పేరు. ఇటీవల ప్రపంచ కప్ గెలిచాక టీ20 వరల్డ్ కప్‌కి రిటైర్‌మెంట్ ప్రకటించాడు. అప్పటి వరకు మూడు ఫార్మాట్‌లలో దేశం కోసం టన్నుల కొద్ది పరుగులు చేశాడు. ఈ లెజెండరీ క్రికెటర్ నేటికి (ఆగస్టు 18) అంతర్జాతీయ క్రికెట్‌లో 16 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా విరాట్ గురించి కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడిన పాత వీడియోను స్టార్ స్పోర్ట్స్ తాజాగా షేర్ చేసింది. విరాట్‌కు ఎప్పుడు పరుగుల దాహం ఉంటుందని రోహిత్ అన్నాడు.' పరుగులు సాధించాలనే ఆకలి, అతడి ప్యాషన్ సాటిలేనివని మనందరికీ తెలుసు. మీరు అతడిని చూసిన ప్రతిసారి అన్ని సమయాల్లో డిఫరెంట్ ఎనర్జీతో బయటకు వస్తాడు. టీమ్‌కి చాలా రకాలుగా ఉపయోగపడతాడు. అతడి అనుభవం చాలా గొప్పది. అంటే భారతదేశం కోసం చాలా మ్యాచ్‌లు ఆడాడు. అవి పోరాటాలు, కఠినమైన పరిస్థితుల నుంచి పుడతాయి. కోహ్లికి అంతా మంచి జరగాలని కోరుకుంటున్నాను. మేము అతడ్ని చూసిన ప్రతిసారీ అతడి గేమ్ డిఫరెంట్ లెవల్‌లో ఉంటుంది' అని పేర్కొన్నాడు.

### మహీంద్రా ఎక్స్‌యూవీ

## 700పై భారీ డిస్కౌంట్

**విశ్వంభర, బిజినెస్ :** సెవెన్ సీటర్ కార్లను కొనడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అందువల్ల ఈ కార్లకు ఇండియన్ ఆటోమొబైల్ మార్కెట్లో డిమాండ్ విపరీతంగా పెరిగిగింది. ఇక సెవెన్ సీటర్ కార్లలో మహీంద్రా XUV కార్‌కి మామూలు క్రేజ్ లేదనే చెప్పాలి. కంఫర్ట్ విషయంలో కానీ ఫీచర్స్ విషయంలో కానీ ఈ కార్ వాహనదారులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.ఇది మంచి లగ్జరీ కార్. పైగా బడ్జెట్ ధరలో ఉండటం వలన జనాలు దీన్ని కొనడానికి క్యూలో ఉంటారు. అందుకే ఈ కార్ అమ్మకాలు భారీగా ఉంటాయి. ఈ సూపర్ స్టైలిష్ కార్ ఎక్కువగా అమ్ముడుపోవడం వలన మహీంద్రా కంపెనీ మంచి లాభాలను పొందుతుంది. ఇకపోతే మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ గత నెలలో ఈ కార్ టాప్ ఎండ్ వేరియంట్ల ధరలను దాదాపుగా రూ.2.50 లక్షలు దాకా తగ్గించింది. ఇప్పుడు వేరే వేరియంట్ల ధరలను కూడా తగ్గించింది. వీటిలో తాజాగా ఎక్స్‌యూవీ 700 AX5 డీజిల్ ఆటోమేటిక్ 7-సీటర్ వెర్షన్ ధరపై భారీ డిస్కౌంట్ ఇచ్చింది. ఈ కార్ ధరని 70 వేల వరకు కంపెనీ తగ్గించింది. అంటే ఇప్పుడు ఎక్స్‌యూవీ 700 AX 5 డీజిల్ ఆటోమేటిక్ 7 సీటర్ ధర దాదాపు రూ.21 లక్షలు దాకా ఉంటుందని తెలుస్తుంది. ఇంకా అలాగే ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ ఉన్న AX 5 పెట్రోల్ మాన్యువల్ సెవెన్-సీటర్, AX 5 పెట్రోల్ మాన్యువల్ 7-సీటర్, ఎఎక్స్ 5 డీజిల్ మాన్యువల్ 7-సీటర్ వేరియంట్లపై కూడా రూ .50,000 డిస్కౌంట్ ఇచ్చింది కంపెనీ. అలాగే XUV 700 AX 3 డీజిల్ ఆటోమేటిక్ 7-సీటర్, ఏఎక్స్5 డీజిల్ ఆటోమేటిక్ 5-సీటర్ వేరియంట్లపై రూ .20,000 డిస్కౌంట్ ఇచ్చింది.ఇప్పుడు XUV 700 ఎక్స్-షోరూమ్ ధరలు



రూ .14 లక్షల నుంచి స్టార్ట్ అవుతాయి. ఈ స్టైలిష్ ఎస్యూవి కార్‌ని 2.0-లీటర్ టర్బోఛార్జ్ పెట్రోల్ ఇంకా 2.2-లీటర్ టర్బోఛార్జ్ డీజిల్ ఇంజిన్ ఆప్షన్‌లలో మహీంద్రా కంపెనీ అందజేస్తుంది. ఈ ఎస్‌యూవీలో 6-స్పీడ్ మ్యాన్యువల్ గేర్ బాక్స్ ఉంటుంది. అలాగే దీనికి 6-స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. ఈ మహీంద్రా ఎక్స్‌యూవీ 700ను మనం ఐదు లేదా ఏడు సీట్ల ఆప్షన్‌లో కొనుగోలు చేయవచ్చు. ఇందులో ఉండే ఆల్ వీల్ డ్రైవ్ ఆప్షన్ కస్టమర్లని విపరీతంగా ఆకట్టుకుంటుంది. మహీంద్రా తన ఫ్లాగ్‌షిప్ మోడల్‌గా ఈ కార్ ని ఆగస్టు 14, 2021 న ఇండియన్ ఆటోమొబైల్ మార్కెట్లో రిలీజ్ చేసింది. అప్పటి నుంచి మహీంద్రా కేవలం మూడు సంవత్సరాల కాలంలోనే ఈ XUV 700 సిరీస్‌లలో దాదాపు 2 లక్షలకు పైగా యూనిట్లను అమ్మగలిగింది.

## టాటా మ్యూచువల్ ఫండ్ కొత్త స్కీమ్ ప్రారంభం

**విశ్వంభర, బిజినెస్ :** టాటా అసెట్ మెనేజ్మెంట్ కంపెనీ మరో కొత్త స్కీమ్ తీసుకొస్తోంది. అదే టాటా నిఫ్టీ 200 అల్ఫా 30 ఇండెక్స్ ఫండ్. ఇది ఒక ఓపెన్ ఎండెడ్ ఫండ్ స్కీమ్. నిఫ్టీ 200 అల్ఫా 30 ఇండెక్స్‌లో పెట్టుబడులు పెడుతుంది. నిఫ్టీ 200 సూచీల్లో హై అల్ఫా విలువ గల టాప్ 30 కంపెనీల పని తీరును గమనిస్తూ ఇన్వెస్ట్‌మెంట్లు చేస్తుంటుంది. తమ పెట్టుబడిదారులకు రిస్క్ ఫ్రీ రిటర్న్స్ అందించాలనే లక్ష్యంగా ఈ కొత్త ఫండ్ ఆఫర్ తీసుకొస్తున్నట్లు టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. అయితే, హైరిటర్న్స్ వస్తాయన్న గ్యారెంటీ, వారంటీ ఏమీ ఉండదని పేర్కొంది. టాటా మ్యూచువల్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ (NFO) ద్వారా తీసుకొస్తున్న టాటా నిఫ్టీ 200 అల్ఫా 30 ఇండెక్స్ ఫండ్‌లో కనీస పెట్టుబడి రూ. 5000 గా కంపెనీ నిర్ణయించింది. ఆ తర్వాత ఎంతైనా ఇన్వెస్ట్ చేయొచ్చు. ఈ కొత్త ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 19, 2024న మొదలవుతోంది. సెప్టెంబర్ 2, 2024 వరకు సబ్‌స్క్రిప్షన్ పొందవచ్చు. అల్ఫా ఫ్యాక్టర్ ఆధారంగా ఈ ఫండ్‌ని కపిల్ మేనన్ నిర్వహిస్తారు. మార్కెట్ రిటర్నులకు మించి రాబడులు అందించే స్టాక్స్‌ని గుర్తించి, రిస్క్ ఫ్రీ రిటర్న్స్ వచ్చేందుకు ఆయన కృషి చేస్తారు. పర్ యూనిట్ ఆఫ్ రిస్క్ పై హై రిటర్న్స్ అందించే స్టాక్స్‌కి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీని ద్వారా నిఫ్టీ 200 అల్ఫా 30 ఇండెక్స్ ఫండ్ మంచి పని తీరు కనబరుస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ కొత్త ఫండ్ లాంచ్ సందర్భంగా టాటా అసెట్ మేనేజ్మెంట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఆనంద్ వరదరాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అల్ఫాను అందించగల టాప్ 30 స్టాక్స్‌లను ఎంచుకోవడం ద్వారా నిఫ్టీ 200 ఇండెక్స్ అందించ గల రిటర్న్స్ కంటే అదనపు రాబడిని సంగ్రహించడమే ఈ ఫండ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తమ ప్రొడక్ట్ పోర్ట్ ఫోలియోను నిర్మించాలనే ఉద్దేశంతో ఇది తమ వైపు నుంచి మరొక విభిన్నమైన ఆఫర్ అని అన్నారు. కస్టమర్ల పెట్టుబడి పోర్ట్ ఫోలియోను నిర్మించడం, వైవిధ్యపరచే విషయంలో ఇవి వారికి విలువను జోడిస్తాయని విశ్వసిస్తున్నామన్నారు.

# పని దొరుకుతుంది కాబట్టే చేస్తున్నా

కొందరు బతకడం కోసం పనిచేస్తారు. కొందరు పనిచేయడం కోసమే బతుకుతారు. రెండో రకానికి చెందిన వ్యక్తి బిగ్‌బీ అమితాబ్. 81ఏళ్ల వయసులో తను చేయడానికి పని దొరుకుతున్నందుకు ఆనందిస్తున్నారాయన. ఈ వయసులో ఇంకా బిజీగా పనిచేస్తుండటంపై తాజాగా తన బ్లాగ్‌లో స్పందించారు అమితాబ్. 'మీకు వయసు అయిపోయింది. ఈ వయసులో కూడా అతిగా పనిచేయడం అవసరమా? రెస్ట్ తీసుకోవచ్చుకదా! అని చాలామంది నాకు సలహాలిస్తూ ఉంటారు. వారికి చెప్పేదొక్కటే. ఇప్పటికీ పని చేస్తున్నానంటే కారణం.. నాకు పని దొరకడమే. అంతకంటే వేరే కారణం ఏమీలేదు. పని దొరుకుతుంది కాబట్టే చేస్తున్నా. మరి నా పని మీకేమైనా సమస్యగా ఉందా? లేదు అనుకుంటే, వెళ్లి మీ పని మీరు చూసుకోండి. నేనెందుకు పని చేస్తున్నానో అర్థమవుతుంది.' అంటూ చెప్పుకొచ్చారు బిగ్‌బీ. ఆయన కామెంట్స్ ప్రస్తుతం బాగా వైరల్ అవుతున్నాయి.





# 'కమిటీ కుర్రోళ్ళు' వారి కష్టం తెరపై కనిపించింది: చిరంజీవి

'కమిటీ కుర్రోళ్ళు'లో నటీనటులందరూ కథానుగుణంగా మేకోవర్ అవ్వడమే కాకుండా, చక్కగా నటించారని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రమిది. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఆగస్టు 9న విడుదలైన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పటికే మహేష్‌బాబు, రామ్ చరణ్, ఎస్.ఎస్.రాజమౌళి, సుకుమార్, క్రిష్, దేవిశ్రీ ప్రసాద్ సహా పలువురు సెలబ్రిటీలు సినిమాపై ప్రశంసలు కురిపించారు. తాజాగా సినిమా చూసిన చిరంజీవి చిత్ర బృందాన్ని పిలిచి అభినందించారు. ''కమిటీ కుర్రోళ్ళు' సినిమాను చూశా. చాలా చక్కగా ఉంది. అందరూ కొత్త కుర్రాళ్లే. చాలా బాగా చేశారు. సినిమా చూస్తున్నప్పుడు కొత్తవాళ్లు యాక్ట్ చేస్తున్నారనే విషయాన్ని మరచిపోయా. ఎమోషనల్ సీన్స్ చాలా చక్కగా పండాయి. నటీనటులందరూ కథానుగుణంగా మేకోవర్ అయిన తీరు అద్భుతం. సినిమాను నేచరల్‌గా చిత్రీకరించటం కోసం మొత్తం టీమ్ పడిన కష్టం తెరపై కనిపించింది. బడ్జెట్‌లో సినిమాను తెరకెక్కించిన దర్శకుడు యదువంశీకి ప్రత్యేకమైన అభినందనలు. దర్శకుడిగా తను చక్కటి ప్లానింగ్‌తో సినిమాలోని ప్రతీ సన్నివేశాన్ని ముందుగా డిజైన్ చేసుకోవటం వల్ల బాగా తెరకెక్కించగలిగారు'' అని అభినందించారు.

# త్రివిక్రమ్‌పై నాన్న చూపించే ప్రేమ చిరాకు తెప్పిస్తుంది : హరీష్ శంకర్

ఇటీవలే రవితేజ హీరోగా నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు హరీష్ శంకర్ . భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ బోల్తా కొట్టింది. హరీష్ శంకర్‌పై పెద్ద ఎత్తున ట్రోల్స్ కూడా వచ్చాయి. ఇదిలా ఉంటే తాజాగా సోషల్ మీడియాలో క్వశ్చన్ అండ్ ఆన్సర్స్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఈ సెషన్‌లో త్రివిక్రమ్ తో సమస్యల గురించి ఓ నెటిజన్‌ను హరీష్ శంకర్‌ను ప్రశ్నించాడు. దీనిపై హరీష్ శంకర్ స్పందిస్తూ.. మంచి ప్రశ్న ఇది. ఈ టాపిక్ నా దృష్టికి వచ్చింది. నేను అసిస్టెంట్ డైరెక్టర్ అయ్యే కంటే ముందే త్రివిక్రమ్ 2-3 నంది అవార్డులను అందుకున్నారు. నాకు త్రివిక్రమ్ డైలాగ్స్ అంటే చాలా చాలా ఇష్టం. ఆయన నాకు సీనియర్. ఈ విషయాన్ని నేనెక్కడా బయట పెట్టలేదు. మా నాన్న త్రివిక్రమ్‌కు వీరాభిమాని. ఆయన అతడు సినిమాను వందల సార్లు చూశారు.

మా ఇంట్లో త్రివిక్రమ్ పెద్ద కొడుకు లాంటి వారు. ఒకవేళ నా సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ ఎక్కువుంటే.. త్రివిక్రమ్ సినిమాలు చూడాలని నాన్న సలహా ఇస్తారు. త్రివిక్రమ్‌పై నాన్న చూపించే ప్రేమ కొన్ని సార్లు నాకు చిరాకు (నవ్వుతూ) తెప్పిస్తుంది. నా సినిమాలను త్రివిక్రమ్ నాన్నకు చూపించాలనుకుంటుంటా. ఆయన నా అభిమాని కావాలనుకున్నా.. అందుకే నాన్న నాకు సలహాలివ్వడం మానేశారంటూ చెప్పుకొచ్చాడు.



# థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్ వచ్చేస్తోంది

1999లో సుమారు 188మంది ప్రయాణిస్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 814ను హైజాక్ చేశారు ఉగ్రవాదులు. ప్రయాణికులను దాదాపు 7రోజుల పాటు బందీలుగా ఉంచి... ప్రపంచ ఏవియేషన్ చరిత్రలోనే అతి పెద్ద హైజాక్ ఘటనల్లో ఒకటిగా నిలిచిపోయిన ఈ సంఘటన ఆధారంగా రూపొందుతున్న సిరీస్ 'ఐసీ814:ది కాంధార్ హైజాక్' . అనుభవ్ సిన్హా దీన్ని రూపొందిస్తున్నారు. విజయ్ వర్మ, అరవింద్ స్వామి, దియా మీర్జా, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ విడుదల చేసింది. హైజాక్ మొదలైన దగ్గరి నుంచి ఆ తర్వాత దిల్లీలోని వార్‌రూమ్‌లో జరిగిన ఘటనలను చూపిస్తూ ట్రైలర్ మొదలు పెట్టారు. మొదట అమృత్‌సర్‌కి విమానాన్ని తీసుకెళ్లిన హైజాకర్లు.. తర్వాత దానిని దుబాయ్‌కు అనంతరం కాంధార్‌కు ఎందుకు తరలించారు?



అందులోని ప్రయాణికులందరినీ సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ఆద్యంతం ఉత్కంఠగా తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఆగస్టు 29వ తేదీ నుంచి 'ఐసీ 814: ది కాంధార్ హైజాక్' స్ట్రీమింగ్ కానుంది. కెప్టెన్ దేవి శరణ్, శ్రింజయ్ చౌదరి రాసిన పుస్తకం 'ఫ్లైట్ ఇన్‌టూ ఫియర్ ' ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు.



# గుర్తింపు కోసమే ప్రభాస్‌పై అర్షద్ కామెంట్స్

బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ.. ప్రభాస్‌పై చేసిన కామెంట్స్ తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. వీటిని ఖండిస్తూ పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాజాగా టాలీవుడ్ నిర్మాత శ్రీనివాస కుమార్(ఎస్‌కెఎన్) వీటిపై స్పందించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన ఎక్స్‌లో ఓ నెటిజన్ పోస్ట్‌కు ఆయన కామెంట్ పెట్టారు. గుర్తింపు కోసమే ప్రభాస్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. వాళ్ల ఉనికిని కాపాడుకోవడం కోసం కష్టపడుతున్నారన్నారు. 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్ పాత్ర జోకర్‌లా ఉందంటూ అర్షద్ ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఎక్స్‌లో వైరల్‌గా మారాయి. వీటిపై ప్రభాస్ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్షద్ క్షమాపణలు చెప్పాలంటూ పోస్టులు పెడుతున్నారు. నిర్మాత అభిషేక్ అగర్వాల్ కూడా ఈ కామెంట్స్‌పై స్పందించారు. ఎంతో మంది ప్రేక్షకులు డార్లింగ్ అని పిలిచే వ్యక్తిని జోకర్ అనడం భావ్యం కాదన్నారు. "సినిమాకు రివ్యూ ఇవ్వచ్చు.. దాన్ని విమర్శించవచ్చు. కానీ, మిస్టర్ అర్షద్ వార్సీ మాట్లాడిన మాటలు నిర్మాణాత్మకమైన విమర్శలుగా లేవు. కొంచెం ఆలోచించి మాట్లాడి ఉంటే బాగుండేది' అని అన్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్‌గా ఇన్‌స్టా స్టార్ ఇమాన్వీ ఎస్మాయిల్ నటించనున్నారు. హీరోయిన్‌గా ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఈమె పేరు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. దీంతో నెటిజన్లు ఈ అమ్మడి కోసం తెగ సెర్చ్ చేసేశారు. అలాగే ఆమె ఇన్‌స్టా ఫాలోవర్స్ కూడా భారీగా పెరిగారు. ఓవర్ నైట్‌లో లక్షకు పైగా ఫాలోవర్స్ పెరగడం గమనార్హం. ప్రస్తుతం ఆమెను 8 లక్షల మందికి పైగా ఫాలో అవుతున్నారు.



# అలియా గురువుగా హృతిక్..?

దేశాన్ని పాలించడానికి వస్తున్నారు 'ఆల్ఫా' అమ్మాయిలు అంటూ ఇటీవలే తన రాబోయే చిత్రాన్ని ప్రకటించింది బాలీవుడ్ కథానాయిక అలియా. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలింస్ నిర్మిస్తున్న మొదటి మహిళా గూఢచారి చిత్రమిది. శార్వరీ వాఘ్ కీలక పాత్ర పోషిస్తుంది. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం బయటికొచ్చింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో అగ్రకథానాయకుడు హృతిక్ రోషన్.. అలియా గురువు పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. మొదటి షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో కశ్మీర్‌లో రెండో షెడ్యూల్ షూటింగ్‌ను మొదలుపెట్టడానికి సన్నాహాలు చేస్తుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com